














| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 196 | ది. 10-10-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 196 | Date : 10-10-2025 | Friday | Pages : 8 | Rs.1/- |


# మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాలకు మాస్టర్ ప్లాన్

- రైతుసేవా కేంద్రాలను పునర్ వ్యవస్థీకరించండి
- భూసారం పెంపుతో లాభసాటిగా సేంద్రీయ సాగు
- రాష్ట్రంలో రైతు బజార్లను ఆధునీకరించండి
- రైతుకు ధర దక్కాలి... వినియోగదారునికి ధర తగ్గాలి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు





**అమరావతి,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖరీఫ్ సాగు, రబీ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వాల్యూ అడిషన్ పై సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే ఈ నెల 11వ తేదీన ప్రధాని మోదీ ప్రారంభించనున్న పీఎం ధన్ ధాన్య కృషి యోజనపై కూడా సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."రైతులకు లాభం రావాలి... వినియోగదారునికి ప్రయోజనం కలగాలి. ఈ విషయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రైతు బజార్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. పత్తికొండలో ఇటీవల కాలంలో టమాటో పంటకు ధర తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పంటను రైతు బజార్లకు తరలించి.. వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలి. కోల్డ్ చైన్ లాంటి వ్యవస్థలను ఉపయోగించుకుని టమాటో పంటలకు ధర తగ్గకుండా చూసుకోవాలి. రైతు బజార్లను ఆధునీకరించాలి. అర్బన్ ప్రాంతాల్లో రైతు బజార్ల ఆధునికీకరణకు భూమి ఎంత వరకు అవసరమవుతుందో అంచనా వేయాలి. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. మార్కెట్ కమిటీలను, రైతు బజార్లను అనుసంధానం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా నిధుల సమీకరణ చేపట్టి... వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకుంటూ కోల్డ్ చైన్, అగ్రి ప్రాసెసింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి." అని సీఎం ఆదేశించారు.

**ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన..** "రైతు సేవా కేంద్రాలను పునర్ వ్యవస్థీకరించేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన రైతులకు సేవలందించేలా రైతుసేవా కేంద్రాలను తీర్చిదిద్దాలి. రైతులకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించే విషయంలో రైతుసేవా కేంద్రాలే కీలక పాత్ర పోషించాలి. ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ పంట వస్తుందని.. ఆదాయం వస్తుందని రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువ వాడేస్తున్నారు. తద్వారా భూసారం క్షీణించడంతో పాటు వ్యాధులు వస్తున్నాయి. రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించిన ఉత్పత్తుల వినియోగం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మంచి పోషక విలువలు అందించటం ద్వారా భూసారం పెంచాలి... దాని ద్వారా ఉత్పాదకత పెంచాలి. 2026 ఖరీఫ్ సీజన్లో సేంద్రీయ సాగు పెంచేలా, ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన పెంచాలి. ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణంతో పాటు ఆరోగ్యపరంగా, ఆర్ధికంగా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. ఎలాంటి మార్పులు జరగాలన్నా... క్షేత్రస్థాయిలో ఉండేవారికి పూర్తి స్థాయి అవగాహన ఉండేలా చూడాలి. భూసారం పెంచే పోషకాల విషయంలో లోపాలను సవరించి తదుపరి ప్రణాళికలు చేసుకోవాలి. దశలవారీగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి." అని సీఎం అన్నారు.

**రబీ సీజన్‌కు పక్కా ప్రణాళిక..** "రబీ సీజన్ కోసం 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని సమీక్షలో అధికారులు వివరించారు. ఇప్పటికే జిల్లాలకు 41 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలకు సరఫరా చేశామని అధికారులు చెప్పారు. పోర్టుల్లో 79,527 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."రబీ సాగు కోసం భూసార పరీక్షలు చేసి... ఆ డేటా ప్రకారం మైక్రో న్యూట్రియంట్స్ వేసుకునేలా రైతును ప్రోత్సహించండి. వచ్చే సీజన్‌కు భూసార పరీక్షలపై ఓ ప్రామాణిక విధానాన్ని రూపొందించండి. దుకాణాల వారీగా, రైతుసేవా కేంద్రాల వారీగా రికార్డులు నవీకరణ చేయాలి. భూసార పరీక్షల రిపోర్టుల ఆధారంగా ఎకరాకు ఎంత ఎరువు వినియోగించాలో రైతులకు దిశా నిర్దేశం చేయాలి. యూరియా ఎవరు తీసుకున్నారనే విషయాన్ని పూర్తి స్థాయిలో రికార్డులు నిర్వహించాలి. రైతులు, కౌలు రైతులకు ఎంత యూరియా సరఫరా చేశారన్న అంశంపై రికార్డులు పక్కాగా ఉండాలి. సాగు విస్తీర్ణం ప్రకారం ఎరువుల సరఫరా జరగాలి. యూరియాను డైవర్ట్ చేసిన ఉదంతాలు ఇటీవల కాలంలో చూశాం. ఆధార్ ఆథంటికేషన్ చేసి ఎరువుల సరఫరా జరగాలి. ఈ ఏడాది 90.91 లక్షల మెట్రిక్ టన్నుల మేర పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. 51 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం. ఇది గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికం. టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలి." అని చంద్రబాబు చెప్పారు.

# మూడు నెలల్లోగా మత్స్యకార సమస్యల పరిష్కారం కృషి

## -డిప్యూటీ సీఎం పవన్ వెల్లడి




**కాకినాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర పరిశీలన జరిపి మూడు నెలల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉప్పాడ మత్స్యకార సోదరులతో మాట-మంతి కార్యక్రమాన్ని నిర్వహించి మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంధ సంస్థలతో ముఖాముఖి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో బాటు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్ల దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు పిడుగు హరి ప్రసాద్, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి అధికారులు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరక్టర్ మైలవరపు కృష్ణ తేజ, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్-సెక్రటరీ ఎస్.శరవరణ్, మత్స్యశాఖ కమీషనర్ రామ్ శంకర్ నాయక్, రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ కూడా కార్యక్రమానికి హాజరైయ్యారు. కార్యక్రమంలో తొలుత సముద్ర వేటలో ప్రమాదవశాన మరణించిన 18 మంది మత్స్యకారులకు కుటుంబాలకు గ్రూప్ ఏక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ క్రింద తొలివిడతగా ఒక్కరికికీ 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 90 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తాల చెక్కులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన మాట-మంతి కార్యక్రమంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్సకార గ్రామాల ప్రతినిధులు కె.రాంబాబు, కె.వెంకటరమణ, సిహెచ్.దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడ రాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బడే విజయకుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవుళ్లు, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పాల్గొని పారిశ్రామిక వ్యర్థాల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉపముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించాలని వినతి చేశారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం కల్పించాలని కోరారు.

**వారు ప్రస్తావించిన సమస్యలు:** ఉప్పాడ తీరంలోని ఎస్ఈజడ్ లో నెలకొల్పిన పరిశ్రమలు శుద్ధి చేయకుండా తమ వ్యర్థాలను సముద జలాల్లో విడిచి పెడుతున్నందున గడచిన 4,5 సంవత్సరాలుగా మత్స్య సంపద క్రమేపి తరగి పోయి మత్స్యకారులు జీవనోపాధికి ముప్పుగా పరిణమిస్తోంది. - ఈ ఏడాది రెండు నెలల పాటు వేట నిషేధ కాలం ముగిసి తరువాత వేటకు వెళ్లిన మత్స్యకారులకు సముద్రంలో చేపలు దొరకక ఆదాయం లేక అల్లాడుతున్నారు. - మత్స్యకారులకు వేట నిషేధ కాలం విధించిన సమయంలోనే పరిశ్రమలకు కూడా వ్యర్థాల విడుదలపై నిషేధం విధిస్తే మత్స్య సంపదకు ముప్పు ఉండదు. - కొత్తగా నిర్మిస్తున్న హార్బర్ డిజైన్ లోపాల వల్ల సముద్ర అలల కల్లోలం పెరిగి బోట్లు నిర్మాణాలకు గుద్దుకుని ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. హార్బర్ డిజైన్ లోపాల సవరణకు రిడిజైనింగ్ చేయించాలి. - సముద్రంలో పరిశ్రమలు వేసిన పైపుల వల్ల వలలకు నష్టం వాటిల్లుతోంది. - ఉప్పాడ, కోనపాప పేట వద్ద తీరం కోతకు గురి కావడం వల్ల మత్స్యకారులు ఇళ్లు కోల్పోతున్నారు. వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలి. - ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న స్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి. - పరిశ్రమల ఏర్పాటుకు మత్స్యకారులు వ్యతిరేకం కాదని, అయితే పరిశ్రమల వల్ల తమ జీవనోపాధికి ముప్పు వాటిల్లకుండా కాపాడాలి. - పరిశ్రమల వల్ల జీవనోపాధి ప్రభావితమౌతున్న మత్స్యకార కుటుంబాలకు యానం, ముమ్మిడివరం లలో ఓఎన్జీసి సంస్థ ప్రతి నెలా 11,500 రూపాయలు అందిస్తున్నట్లే ఉప్పాడ, తొండంగి ప్రాంత మత్స్యకారుల కుటుంబాలకు ప్రతి నెలా పరిహారం అందించాలి. - మత్స్యకార కుటుంబాలలో చదువుకున్న యువతకు తీరంలో ఏర్పాటైన పరిశ్రమలలో ఇంటర్న్ షిప్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలి. - సెప్టెంబరు నుండి నవంబరు వరకూ స్థానిక సముద్ర తీరంలో అలజడి వల్ల చేపల వేట సాధ్యం కాదని, ఈ సమయంలో పొరుగు ప్రాంతాల్లో వేటకు వెళ్లిన ఉప్పాడ మత్స్యకారులకు అంతర్వేది, మచిలీపట్నం తీరాలలో లాండింగ్ అయ్యేందుకు అక్కడి మత్స్యకారుల నుండి అభ్యంతరం వ్యక్తం అవుతోంది.






# ఓంక్యాప్ ద్వారా లక్ష బ్లూకాలర్ ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయండి
- ఐటిఐల అభివృద్ధికి మిషన్ మోడ్ లో చర్యలు చేపట్టండి
- స్కిల్ డెవలప్ మెంట్ సమీక్షలో మంత్రి నారా లోకేష్



**అమరావతి,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఓంక్యాప్ ద్వారా రాబోయే అయిదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు రూట్ మ్యాప్ రూపొందించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులతో మంత్రి నారా లోకేష్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... నర్సింగ్, వెల్డర్స్, ట్రక్కర్స్, బిల్డింగ్ వర్కర్లకు యూరప్ తోపాటు జర్మనీ, జర్మనీ, ఇటలీల్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. నర్సింగ్, ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన యువతీయువకులకు ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చి, విదేశాల్లో ఉద్యోగాలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించి కేరళ మోడల్ ను అధ్యయనం చేయాలని అన్నారు. యూరప్ జిసిసిలలో డిమాండ్ ఉన్న ఉద్యోగాలపై దృష్టిసారించండి, అందుకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఓంక్యాప్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 2,774 మంది నర్సింగ్ అభ్యర్థులు విదేశీభాషల్లో శిక్షణ పొందుతున్నారని అధికారులు తెలిపారు. జర్మనీ, ఇతర విదేశీ భాషల్లో శిక్షణ కోసం జర్మన్ లాంగ్వేజెస్ ఎసెస్ మెంట్ సెంటర్ ను రాష్ట్రంలో ఏర్పాటుచేయడానికి ఎంఓయు చేసుకున్నట్లు చెప్పారు. నైపుణ్యం పోర్టల్ పై మంత్రి లోకేష్ సమీక్షించారు. ఇందులో 23 విభాగాల డాటా బేస్ ను ఇంటిగ్రేట్ చేసినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో నెలకొని ఉన్న 4,639 భారీ, మధ్యతరహా పరిశ్రమలతో సంబంధించి వారికి అవసరమైన విధంగా వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేయాలని అన్నారు. వచ్చేనెలలో పోర్టల్ ప్రారంభించే సమయానికి ఉద్యోగాలకు సంబంధించి సంపూర్ణ సమాచారాన్ని యువతకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. రాష్ట్రంలోని 83 ప్రభుత్వ ఐటిఐలను మిషన్ మోడ్ లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఐటిఐలలో మౌలిక సదుపాయాలు, ఆధునీకరణ పనుల కోసం రూ.322 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఐటిఐలల్లో ప్రస్తుతం అడ్మిషన్లు పెరిగాయని, అయితే సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. పిఎం వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన, పిఎం ఇంటర్న్ షిప్ లలో ఎపిని నెం.1గా నిలపాలని మంత్రి అన్నారు. ఐటిఐలలో కరిక్యులమ్, టెస్టింగ్, ఇంటర్న్ షిప్, సర్టిఫికేషన్, ప్లేస్ మెంట్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలని సూచించారు. పిఎం సేతు పథకం కింద ఐటిఐల అప్ గ్రేడేషన్ కు గల అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 87 పాలిటెక్నిక్ లకు సంబంధించి 646 టీచింగ్, 2183 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దేశంలోని సక్సెస్ మోడల్ ను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. హబ్ అండ్ స్పోక్ మోడల్ లో విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 3 హబ్ లు, వాటిని అనుబంధంగా 13స్పోక్స్ లలో ఐటిఐలను అభివృద్ధి చేయడానికి త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి లోకేష్ చెప్పారు. ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ అనుబంధ సంస్థ నామ్ టెక్ రాష్ట్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ కార్పొరేషన్ సిఇఓ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలకు రుణాలను త్వరిత గతిన అందించాలి

## -సహజ ఉత్పత్తులను ప్రోత్సహించాలి మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** స్వయం సహాయక సంఘాల కోసం రూపొందించిన సూక్ష్మ రుణ ప్రణాళికను బ్యాంకులకు అందజేసి, సాంకేతిక సమస్యల పరిష్కారంతో ప్రతీ సంఘానికి రుణాలను త్వరిత గతిన అందించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయంలో మంత్రి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సీవీడ్(సముద్రపునాచు), వెదురు సాగు, మునగ సాగు(మునగ ఆకు పొడి), మిల్లెట్స్ ఉత్పత్తులలో తగిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎఫ్ పీవో (ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్)లను బలోపేతం చేయాలని, అందుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంబంధిత సంస్థల నుంచి తీసుకుని త్వరిత గతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేతి సంస్థ నుంచి తీసుకుంటున్న షేడ్ నెట్లను సకాలంలో ఏర్పాటు చేయాలని

## సెల్ఫీ ఫోటో విడుదల చేసిన ఎంపీపీ దంపతులు



**విస్సన్నపేట,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పిఎం వనజాక్షి రాజేష్ దంపతులు విజయవాడలో జరిగిన వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశానిక హాజరైన సమయంలో తమ సెల్ఫీ ఫోటోలు విడుదల చేశారు. ఏపీ స్టేట్ వైసిపి గ్రీవెన్స్ సెల్ సభ్యులు నరేడ్ల వీరారెడ్డి తో దిగిన ఫోటోను మీడియాకు అందించారు. జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ అధ్యక్షతన సీనియర్ వైసీపీ నాయకులు వై వి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అని తెలియజేశారు. రాబోయే కాలంలో వైరి వర్గాల గజకర్ణ గోకర్ణ టక్కుటామార విద్యల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రతిపక్ష వైసిపి తీసుకోవలసిన అంశాలు చర్చకు వచ్చాయి అన్నారు . వైయస్ జగన్మోహన రెడ్డి నాటి ప్రభుత్వ పరిపాలనలో నవరత్న పథకాలను గ్రామ సచివాలయాల ద్వారా గ్రామ వాలంటరీల సహాయ సహకారాలతో కులమత రాజకీయాలకతీతంగా అవినీతి రహితంగా అందించిన మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సువర్ణ పాలన ఘనత చరిత్ర మరువలేమన్నారు. నిజం నిప్పులాంటిది అన్నారు. ఆలస్యంగా నైనా వెలుగులోకి వస్తుంది అని రాబోయేవి అన్ని మంచి మంచి రోజులే అని చెప్పారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు



**విస్సన్నపేట,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తెల్లదేవరపల్లి పీహెచ్ సి నందు సూపర్ జీఎస్ టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ అశ్విని దత్, డాక్టరు పి నాగేశ్వరరావు , ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు , మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు , రాయల సురేష్ , , ఉప సర్పంచ్ డి చలపతి రావు మోరంపూడి రవి తదితరులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ,సచివాలయ సిబ్బంది ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు

- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి
- వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు



**కాకినాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** వికాస ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ (బుధవారం) నుండి డి.డి.యు.జి.కె.వై సెంటర్ వాకలపూడి, కాకినాడ నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణకు ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ, ఐ.టి.ఐ, డిప్లొమో ఉత్తీర్ణులైన 18 నుండి 30సం.లలోపు పురుష అభ్యర్థులు అర్హులు. వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3 నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణా సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీమెటీరియల్ అందించబడును. పై కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్లో శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలలోపు సెల్ నెంబర్లను 8328483297, 8978475164 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవలెను. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

## మత్స్యకార కుటుంబాలకు బీమా చెక్కులు అందజేత..




**కాకినాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన 18 మంది మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.90 లక్షల ప్రమాద బీమాను కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ లో ఉప్పాడ మత్స్యకార సోదరులతో మాట-మంతి కార్యక్రమంలో మత్స్యకారులతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 18 మంది మత్స్యకారులకి రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.90 లక్షల బీమా లబ్ధిని కుటుంబికుల బ్యాంకు ఖాతాల్లో నేడు జమ చేసిందని ప్రకటించి చెక్కులు అందించారు. దీనితో మత్స్యకారులు హర్షం వ్యక్తంచేశారు.

## జీఎస్టీ తగ్గుముఖంతో తగ్గిన ధరలపై అవగాహన...



**గుడ్లవల్లేరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** మండలంలోని కౌతవరంలో జీఎస్టీ తగ్గుముఖంతో వివిధ వస్తువులపై తగ్గిన ధరలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ, ఆరోగ్య సిబ్బంది కె.శిరీష, పి. ధనలక్ష్మి, 104సిబ్బంది ప్రకాష్, చార్లెస్, ఆశాలు మరియమ్మ, సుబ్బమ్మ, పెద్దింట్లమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన తపాలా బిళ్ళల ప్రదర్శన..



**కాకినాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** జిల్లా స్థాయి తపాలా బిళ్ళల ప్రదర్శన-పిలాటరీ ఎగ్జిబిషన్ ఎన్ రామచంద్ర రావు, జిల్లా అటవీ శాఖాధికారి, కాకినాడ జిల్లా చేతుల మీదుగా ప్రారంభమైన ప్రదర్శన గురువారం రెండో రోజు కొనసాగింది. ఎన్నో అత్యద్భుతమైన, అతి ప్రాచీనమైన, వివిధ రకాల మేలైన, అరుదైన స్టాంపుల సేకరణ సమాహారం ఈ ప్రదర్శన యొక్క విశిష్టత కాకినాడ నగరములోని అన్ని పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఔత్సాహికులు, ప్రజలు ఒక సంద్రంలా కదలి వచ్చి ఈ సంరంభాన్ని ఎంతో ఆసక్తిగా, ఉత్సాహముగా తిలకించారు. ముగింపు వేడుకలకు జవహర్ లాల్ నెహ్రు సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ ఉపకులపతి ప్రొ.చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ ముఖ్య అతిధి గా విచ్చేసారు. వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఎప్పుడూ చూడని అరుదైన కలెక్షన్స ఉన్నాయని, ఈ తపాలా బిళ్ళల అపురూప ప్రదర్శనను చూసి మంత్రముగ్ధులయ్యానని తెలిపాడు. ఈ ముగింపు వేడుకలకు విచ్చేసిన జి.శివ నాగ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలటిలీ), ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్, విజయవాడ వారు మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు పిలాటలీ కళ పట్ల అవగాహనను సవివరముగా చెప్పారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు తరచూ జరుగుతూ ఉంటే పిలాటలీ కళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనలను పారదర్శకముగా ఎంపిక చేసిన జ్యూరీ, న్యాయ నిర్ణేతలు అనుప్ కుమార్ రౌత్, దేవేందర్ కుమార్ జైన్ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహముగా పాల్గొని, విజేతలుగా నిలిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు మరియు పాఠశాలల యాజమాన్యం మరియు అధ్యాపకులు పిల్లలకు ఈ కళ పట్ల అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ఎగ్జిబిషన్ లో గెలుపొందిన ఫిలాటలిస్ట్ లకు, ఈ ఎగ్జిబిషన్ సందర్భముగా నిర్వహించిన వ్యాస రచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు మరియు క్విజ్ పోటీలలోని విజేతలకు వీసీ. ప్రొఫెసర్ చేకూరి శివ రామకృష్ణ ప్రసాద్ వార్ల చేతుల మీదుగా బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కలగర లక్ష్మీపురం లో సరస్వతి పుత్రుడు అందరికీ గర్వకారణం

- యోగి వేమన యూనివర్సిటీ (కడప) వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ నియామకం
- మన మండలం వ్యక్తి కావటం మనకు గర్వకారణం



**విస్సన్నపేట,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ప్రఖ్యాత విద్యావేత్త, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగి వేమన యూనివర్సిటీ (కడప) నూతన వైస్ ఛాన్సలర్‌గా నియమించింది. ప్రొఫెసర్ రాజశేఖర్ గత మూడు దశాబ్దాలుగా ఉన్నత విద్యా రంగంలో విశేషమైన సేవలందిస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ప్రో వైస్ ఛాన్సలర్, డీన్ – స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మరియు రిజిస్ట్రార్ వంటి కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యా, పరిశోధనా, పరిపాలనా రంగాలలో ఆయనకు ఉన్న విస్తృత అనుభవం కారణంగా యూనివర్సిటీ అభివృద్ధికి దోహదపడే నాయకుడిగా ఆయనను అందరూ ప్రశంసించుచున్నారు . ఆయన మేనేజ్‌మెంట్, సర్వీస్ క్వాలిటీ, కస్టమర్ సాటిస్ఫాక్షన్, రీసెర్చ్ మెథడాలజీ వంటి రంగాల్లో అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పత్రాలను రచించారు. ఆయన పరిశోధనలు గూగుల్ స్కాలర్ మరియు రీసెర్చ్‌గేట్ వంటి అంతర్జాతీయ వేదికలలో విస్తృతంగా ప్రస్తావించబడ్డాయి. యూనివర్సిటీ స్థాయిలో అనేక కొత్త విద్యా ప్రణాళికలు, ప్రత్యేకమైన మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభించడంలో ఆయన కీలక పాత్ర వహించారు. ప్రొఫెసర్ రాజశేఖర్ గారి తల్లి కొక్కెరగడ్డ కనక సుందరమ్మ విసన్నపేట మండలం కలగర లక్ష్మీపురం గ్రామానికి చెందినవారు కావడంతోపాటు స్థానిక మండల కేంద్రంలోని షాలెం ప్రార్థన మందిరం జాన్ బాబు తోడల్లుడు కావడం తోపాటు ఆయన జన్మదినోత్సవం అక్టోబర్ 8వ తేదీనే ఆర్డర్ రావడంతో వారి కుటుంబంలో సంబరాలు అంబరాన్ని అంటాయి . ఆయన భార్య కూడా విసన్నపేట కు చెందినవారు కావటం స్థానిక గ్రామ అల్లుడుగా కోసమెరుపుగా చెప్పుకోవచ్చు. ఈ నియామకంపై స్పందిస్తూ ప్రొఫెసర్ రాజశేఖర్ భావోద్వేగపూరితంగా మాట్లాడుతూ – "నా మాతృమూర్తి నాలుగ తేదీన మరణించారని అమ్మ జీవించి ఉండి ఈ శుభవార్త విని ఉంటే తన జీవితంలో అంతకుమించిన మహానందం మరియు ఒకటి ఉండేది కాదన్నారు . ఆమె ఆశీర్వాదం ఎల్లప్పుడూ నాకు ఆజన్మాంతం ఉంటుందని కోరుకుంటున్నాను అన్నారు. ఈ నియామకాన్ని నా తల్లికి అంకితం చేస్తున్నాను అని చెప్పారు. విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు, బంధువులు ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ కు అభినందనలు తెలియజేస్తూ, ఉపకులాధిపతిగా ఆయన నాయకత్వంలో యోగి వేమన యూనివర్సిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# తిరువూరు విద్యార్థులు ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ లో పవర్ లిఫ్టింగ్ మరియు వెయిట్ లిఫ్టింగ్ ప్రతిభ

**తిరువూరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఈనెల 7 తారీకున చిలకల్లు జెడ్పిటిసి హై స్కూల్ జరిగిన స్కూల్ గేమ్ అండర్ 17 బాల బాలికలు ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో నాగార్జున జూనియర్ కాలేజీ విద్యార్థి వి సువర్ణ 43 కేజీల విభాగంలో 222 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానం కైవసం చేసుకొనియున్నారు . అలాగే మరో విద్యార్థి శ్రీ చైతన్య స్కూల్ టీ ఇంజిల 69 కేజీల విభాగంలో 197 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానం కైవసం చేసుకొనియున్నారు అలాగే నాగార్జున జూనియర్ కాలేజీ విద్యార్థి వి గణేష్ 49 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ లో 92 కేజీల బరువుని ఎత్తి ప్రథమ స్థానం కైవాసం చేసుకున్నారు ఈ విద్యార్థులు రేపు జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ పవర్ లిఫ్టింగ్ వెయిట్ లిఫ్టింగ్ ఎంపికైన సందర్భంగా ఈ విద్యార్థులను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రెవిన్యూ డివిజనల్ అధికారి కుమారి కె. మాధురి మరియు మున్సిపల్ కమిషనర్ మనోజ మున్సిపల్ చైర్ పర్సన్ కె నిర్మల మరియు ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ జిల్లా గౌర అధ్యక్షులు నాగు బండి విశ్వేశ్వర రావు మరియు జిమ్ కోచ్ మల్లేశ్వరరావు ఆంధ్ర ప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు మరియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బి వెంకట్రావు ఈ విద్యార్థులను అభినందించారు



# రాష్ట్రంలోనే నెం.1 బ్లోసంస్ బిజీ బర్డ్స్ ప్రి స్కూల్ - కన్య




**మచిలీపట్నం,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** కృష్ణజిల్లా స్థానిక మచిలీపట్నంలోని బ్లోసంస్ బిజీ బర్డ్స్ ప్రి స్కూల్ వ్యవస్థాపకురాలు కన్య గురువారం నాడు మిడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ... గత 18 సంవత్సరాల నుంచి మచిలీపట్నంలో బ్లొసం బిజీ బర్డ్స్ ప్రి స్కూల్ దిగ్విజయంగా నిర్వహించడం జరుగుతుందని నేడు రాష్ట్రంలోనే నంబర్ వన్ స్కూల్ గా అభివృద్ధి చేశామని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ప్రిన్సిపాల్స్ (AIP) & కాన్ఫిడరేషన్ ఆఫ్ క్వాలిటీ ఇన్ ఏర్లి చైల్డ్ ఉడ్ ఎడ్యుకేషన్ (CQ-ECCE) వారు నిర్వహించిన Early childhood Education.Excellence Award కోసం దేశం మొత్తం మీద 33,000 ప్రీస్కూల్స్ పోటీ చేయగా, మా బ్లొసం బిజీ బర్డ్స్ ప్రి స్కూల్ ఎన్నిక అయినందుకు సంతోషంగా ఉంది అని అన్నారు. 188 రకాల ప్రశ్నలు కి పోటీ నిర్వహించారని, వాటిలో గెలుపొందడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే మా స్కూల్ కరికులం, ఎంబియన్స్, హొలిస్టిక్ డెవలప్మెంట్, సేఫ్టీ అండ్ హైజిన్, పేరెంట్స్ కలుపుగోలు లాంటి అంశాలలో ప్రత్యేకమైన గుర్తింపుపొందింది అని అన్నారు. ఈ నెల 5 వ తేదీన డిల్లీ లో అవార్డ్,బెస్ట్ ప్రి స్కూల్ బ్యాడ్జ్ తీసుకున్నామని, ఈ అచివమెంట్ కి ప్రోత్సహించిన పేరెంట్స్ మరియు మా ఫ్యామిలీ మెంబర్స్ కి అలాగే స్టాఫ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

- లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో రూ. 27వేలు నగదు,75 కిలోల బియ్యాన్ని అందజేత



**మైలవరం,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో నివాసాలు కోల్పోయిన బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని వెల్వడం గ్రామంలో ఇటీవల మూడు ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కు గురయ్యాయి. దీంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్ ఆంజనేయులు స్వచ్ఛందంగా రూ 10 వేలు నగదు అందజేయ గా,పి యం సి సి, ఎస్ .వి .ఎన్. నివృత్ రావు సహకారంతో లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం వారు రూ. 27వేలు నగదు, 75 కిలోల బియ్యం బాధితులకు జిల్లా గవర్నర్ ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సమాజసేవే లక్ష్యంగా లైన్స్ క్లబ్ పనిచేస్తుందన్నారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు కొన్ని పర్మినెంట్ ప్రాజెక్టుల ద్వారా సేవలు అందజేస్తున్నామన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ ఎన్ వి ఎస్ ఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జీఎస్టీ కోఆర్డినేటర్ ముత్య ప్రసాద్, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ సుదీర్ పాల్ రెడ్డి, చిల్డ్రన్ ఐ కేర్ కోఆర్డినేటర్ వై శ్రీనివాసరావు, జెడ్ సి తిరుమల శెట్టి శ్రీధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలవాది హరీష్ కుమార్ గుప్తా, లయన్ క్యాబినెట్ మెంబర్ సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, సీనియర్ లైన్ మెంబర్లు మేడసాని కిషోర్, లేళ్ల ఏడుకొండలు, చంద్రం, పులిపాటి శ్రీనివాస్, మద్దినేని శ్రీను, తోట తిరుపతిరావు, సంగు రాంప్రసాద్, బాలాజీ, గోపాల్, లైన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై భారం తగ్గించటమే

-జీఎస్టీ తగ్గింపు ఎమ్మెల్యే కొలిక్కిపూడి



**తిరువూరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు గవర్నమెంట్ హాస్పటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన జీఎస్టీ తగ్గింపు అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకి స్వాగతం పలికిన ఆర్డిఓకే మాధురి మున్సిపల్ కమిషనర్ కే మనోజ ఎమ్మెల్యే హాస్పటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన మెడికల్ స్టాల్స్ సందర్శించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై అధిక పన్ను భారం తగ్గించడానికి జీఎస్టీ తగ్గించటం ద్వారా మన రాష్ట్రంలో 8 వేల కోట్ల భారం తగ్గిరాష్ట్ర ప్రజలకు ఉపయోగపడుతుంది పన్నులు తగ్గించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది జీఎస్టీ 2.0 కేంద్ర ప్రభుత్వం జిఎస్టి తగ్గింపు స్వాగతిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారు స్వాగతించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలియజేసి జీఎస్టీ తగ్గింపు ప్రజలకు తెలియజేయాలని దసరా పండుగ నుండి ఒక నెల వరకు రాష్ట్రం మొత్తం 60 వేల అవగాహన సదస్సులు నిర్వహించాలని దానిలో భాగంగా అధికార యంత్రాంగం ప్రతిరోజు ఏదో వస్తువుపై తగ్గించిన జిఎస్టి అవగాహన కల్పించాలి ఇప్పుడు మీడియా మిత్రులు ఒక సలహా ఇచ్చారు తగ్గించిన జీఎస్టీ రేట్లు ప్రతి షాపు ముందు పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి అని ఎమ్మెల్యే తెలియజేశారు

## ప్రపంచ దృష్టి దినోత్సవ కార్యక్రమం




**నూజివీడు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ప్రపంచ దృష్టి దినోత్సవ కార్యక్రమాన్ని గిఫార్డ్ మెమోరియల్ హాస్పిటల్ ఆఫ్ సెవెంత్–డే అడ్వెంటిస్ట్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. పలువురు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి రెసిడెంట్ కన్సల్టెంట్ల బృందం డాక్టర్ విజయ లక్ష్మి పోగుల – ఫాకో సర్జన్, డాక్టర్ అస్మా సుల్తానా – పీడియాట్రిక్స్, డాక్టర్ దీప్తి చిన్నం – జనరల్ మెడ్., మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ సామ్ మోసెస్ మరియు శ్రీ దత్తం – సీనియర్ ఐ కేర్ మేనేజర్ పాల్గొన్నారు.

# బాణా సంచా తయారీ,విక్రయ కేంద్రాల అనుమతులు భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయాలి



**అమలాపురం,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న బాణాసంచా తయారీ యూనిట్లు, హెూల్ సేల్ విక్రయ కేంద్రాలకు లైసెన్సులు అనుమతులు భద్రత రక్షణ ప్రమాణాలు అంశాలలో మూడు రోజులపాటు పర్యవేక్షణ బృందాలు వెళ్లి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టరు ఆర్. మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఆర్డీవోలు డీఎస్పీలు తహిశీల్దార్లు అగ్ని మాపక విపత్తుల స్పందన అధికారులు లేబర్ డిపార్ట్మెంట్ కారులతో బృందాలు ఏర్పాటు చేసి బాణాసంచా తయారీ యూనిట్లు, హెూల్ సేల్ దుకాణాలను సందర్శించి మూడు అన్ని అంశాలలో భద్రత రక్షణ అనుమతులు గుర్తింపు పొందిన కార్మికులు పనిచేస్తున్నది లేనిది పరిశీలన చేయాలని ఆదేశించారు. బుధవారం జిల్లాలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు పునరావతం కాకుండా నేటి నుండి ఈ మూడు రోజులపాటు తనిఖీలు నిమిత్తం తయారీ యూనిట్లను హెూల్ సేల్ వ్యాపారాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా బాణా సంచా తయారీ యూనిట్లు 18 వరకు ఉన్నాయని,అదేవిధంగా హెూల్సేల్ డీలర్లు 19 మంది వరకు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వీరి ఆధ్వ ర్యంలో నియమింపబడ్డ తనిఖీ బృందాలు 18 తయారీ యూనిట్ లను 19 హెూల్సేల్ కేంద్రాలను వెలసి 37 యూని ట్లను క్షుణ్ణంగా సేఫ్టీ నామ్స్ పాటించినది అదే విధంగా లైసెన్సులు అను మతులు పొందినది లేనిది క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి పాయింటు నమోదు చేస్తూ తయారీ యూనిట్లకు విడిగా హెూల్సేల్ యూనిట్ల కు వేరే విధంగా రూపొందించిన ప్రొఫార్మాలో వివరాలు నింపి శనివారం సాయంత్రానికి కలెక్టరేట్కు అందించాల న్నారు. ఆవాసాలకు దూరంగా నిబంధనల మేరకు తయారీ యూనిట్లు నిర్వ హిస్తున్నది లేనిది క్షుణ్ణంగా పర్యవేక్షించాలని మైనర్ ఉల్లంఘనలకు పాల్పడిన వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. బాణాసంచా తయారీలో ప్రామాణికంగా వాడే రసాయనాలు కాకుం డా హాని కరమైన, పెద్ద శబ్దాలు,కాలుష్యాలు వ్యాపించే మెటీరియల్ వినియోగిస్తున్న అంశాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యవేక్షించి నిబంధనలు ఉల్లంఘించి నట్లయితే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బాణా సంచా తయారీలో నిర్దేశిత నిష్పత్తిలో రసాయనాలను వాడుతున్నది లేనిది పరిశీలించాలన్నారు. ప్రతి యూనిట్ ప్రామాణిక కండిషన్స్ భద్రతా రక్షణ చర్యలు కొరకు తీసుకుంటున్న చర్యలను నిశితంగా పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి యూనిట్ వద్ద అగ్నిమాపక నిబంధనల ప్రకారం ప్రవేశం బయట మార్గాలు ఉన్నాయో లేదో పరిశీలించి మాక్ డ్రిల్ మాదిరిగా నిర్వాహకులకు కార్మికులకు భద్రతా ప్రమాణాలు పట్ల అవగాహన కల్పించా లన్నారు. ప్రతి యూనిట్లో శిక్షణ పొందిన కార్మికులు ఇతర కార్మికుల వివరాలను భీమా పట్టింపు కై ఒక ఏడాదిలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నది వారందరూ వివరాలు ఈ శ్రమ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదే శించారు. స్కిల్లింగ్ వర్కర్స్ సర్టిఫికెట్లను పరిశీలించాలన్నారు. ప్రతి యూనిట్లో శిక శిక్షణ పొందిన డిజిగ్నేటెడ్ పర్సన్ ఉన్నది లేనిది పరిశీలించి ఎన్ఫోర్స్ చేయాలన్నా రు. ఈనెల 20వ తారీఖున దీపావళి పండుగ పురస్కరించుకొని ఎంత మంది వర్తకులు షాపులు నిర్వహిస్తారో వారం రోజులు ముందుగానే తెలుసుకొని షాపుల నిర్వహణ కొరకు స్థలాలను ఎంపిక చేసి విక్రయాల కొరకు తాత్కాలిక లైసెన్సులను అంద జేయాలన్నారు. విక్రయ సమూహాల వద్ద భద్రతా చర్యలను అగ్నిమాపక పోలీసు సిబ్బంది గత అనుభవాలను దృష్టిలో ఉంచు కొని భద్రత రక్షణ పట్ల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బాణా సంచా తయారీ యూనిట్ల వద్ద 10-15 కేజీల సామాగ్రి తయారైన వెంటనే వేరే చోటకు తరలించి భద్రపరిచే చర్యలను తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నూటికి నూరు శాతం భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాల మధ్య దూరం 3 మీటర్లు ఉండాలని ఎదురుగా ఎటువంటి దుకాణాలు నిర్వహించరాదని ఎల్ షేప్ మాదిరిగా దుకా ణాలు నిర్వహించాలన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన ఉపేక్షించరాదని ఆయన అధికారులకు సూచించారు. ప్రతి బాణాసంచా తయారీ కేంద్రంలో అనుమతి ,లైసెన్స్ ఉండాలన్నారు. 18 ఏళ్లకు దిగువ ఉన్న పిల్లలను తయారీ పనుల్లో నిర్మూలించాలన్నారు. గోదాముల్లో కనీస భద్రతా ప్రమాణాలు ఇసుక, నీరు,అగ్ని నియంత్రణ పరికరాలుశఏర్పాటు చేయాల న్నారు. విద్యుత్ సరఫరా విస్తరణ తగ్గించాలనీ , రసాయనాల నిల్వ, వాడకానికి కఠిన నియంత్రణలు అమలు చేయాలన్నారు. కార్మికులకు బీమా సౌకర్యంతో పాటుగాఅత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సిబ్బంది శిక్షణ పొందింది లేనిది పర్యవేక్షించాలన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు తయారీ, నిల్వ కేంద్రాలను తనిఖీలు నిర్వహించాల న్నారు. లైసెన్సు వివరాలు,రెన్యూవల్ సమాచారం పరిశీలించాల న్నారు. రసాయనాల నిల్వ,అగ్ని ప్రమాద చర్యలు,కార్మి కుల భద్రతా ప్రమాణాలు గమనించాలన్నారు. నివాస గృహాల్లో అక్రమంగా నిల్వ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. షాపుల్లో,తయారీ కేంద్రాల్లో బాణా సంచా సామాగ్రి,అగ్నిని యంత్రణ పరికరాలు తనిఖీ చేయాల న్నారు. ప్రమాద నివారణ పరికరాలకు నిర్వహణ, తనిఖీలు చేయాలన్నారు. రసాయ నాల వాడకానికి గరిష్ట పరిమితి పాటించేలా చూడాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ చర్యలు తనిఖీలు దీపావళి సమయంలో ప్రమాదాల నివారణకు కీలకంగా నిలుస్తాయ న్నారు. అన్ని శాఖల అధికారులు,నిర్లక్ష్యం లేకుండా సమగ్రంగా తని ఖీలు చేయాలన్నారు.

# ఓ మత్స్యకారుడిగా ఆలోచించి సమస్యను పరిష్కరిస్తా

- తీర ప్రాంత కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం
- వంద రోజుల్లో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తాం
- పిఠాపురం మోడల్ ను రాష్ట్రమంతటా అమలు చేస్తాం
- మూడు రోజుల్లో మళ్లీ వస్తా
- సముద్రంలోకి వెళ్లి కాలుష్య ప్రాంతం పరిశీలిస్తా
- పారిశ్రామికవేత్తలను బెదిరించే నాయకుల వలలో మత్స్యకారులు పడొద్దు
- మత్స్యకారులు వేదనతో ఒక మాట అన్నా తీసుకొనేందుకు నేను సిద్ధంగా ఉన్నా
- మాటలు చెప్పడం కాదు..
- సమస్యను పరిష్కరించడంపైనే నా దృష్టి
- ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పూర్తి చేసే బాధ్యత నాది
- ఉప్పాడ బహిరంగ సభలో ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్







**పిఠాపురం, అక్టోబర్ 9, ( వార్తా ప్రభ ) :**నేను ఉప ముఖ్యమంత్రిగానో, ఎమ్మెల్యేగానో ఉప్పాడకు రాలేదు. ఓ మత్స్యకారుడి బాధను అర్థం చేసుకోవడానికి వారి ఇంట్లోని సభ్యుడిగా, వారిలో ఒకడిగా వచ్చాను. నాకు మత్స్యకారులు పడుతున్న వేదన, వేట కోసం పడుతున్న యాతన తెలిసింది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిశ్రమల ద్వారా సముద్రంలో కలుస్తున్న కలుషిత జలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే కనీసం 100 రోజుల సమయం కావాలని, అందరూ మెచ్చే, అందరికీ నచ్చే పరిష్కారాన్ని చూపించే బాధ్యతను తాను తీసుకుంటానని వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని పరిశ్రమల కలుషిత జలాలు నేరుగా సముద్రంలో కలుస్తుండటంతో జరుగుతున్న నష్టాన్ని అరికట్టేందుకు, అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లేందుకు తగిన సమయం కావాలన్నారు. ఉప్పాడ మత్స్యకారులంతా దీనిపై చేతులు పైకి ఎత్తి అభిప్రాయం తెలియజేయాలని బహిరంగ సభలోనే రిఫెరండం కోరారు. పిఠాపురం నియోజకవర్గం, ఉప్పాడ కొత్తపల్లి గ్రామంతోపాటు చుట్టు పక్కలనున్న గ్రామాల్లో కొన్ని ఫార్మా పరిశ్రమల కాలుష్యం కారణంగా మత్స్య సంపద దెబ్బ తింటోందని, వేట కష్టం అవుతోందని గత కొద్దిరోజులుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనల దృష్ట్యా సమస్యను పరిష్కరించేందుకు, మత్స్యకారుల వేదన వినేందుకు పవన్ కళ్యాణ్ మత్స్యకారులతో మాటామంతీ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ లో నిర్వహించారు. అనంతరం ఉప్పాడ సెంటర్లో బహిరంగసభలో ప్రసంగించారు. ఈ సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పరిశ్రమలను మత్స్యకారులెవరూ వద్దు అనడం లేదు. పరిశ్రమల వల్ల వస్తున్న కాలుష్యాన్ని మాత్రమే వారు వ్యతిరేకిస్తున్నారు. ఇది మత్స్యకారులకు అభివృద్ధి మీద ఉన్న అవగాహనకు నిదర్శనం. రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామిక ప్రగతి కీలకం. పరిశ్రమలు వస్తేనే రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. దీన్ని మనసుతో అర్థం చేసుకున్న మత్స్యకారులకు కృతజ్ఞతలు. అయితే మత్స్యసంపదను, వారి జీవనభృతిని దెబ్బతీస్తున్న కాలుష్యాన్ని అరికట్టడంపై ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు తగిన సమయం కావాలి. తీర ప్రాంతంతో పాటు పిఠాపురం చుట్టు పక్కల ప్రాంతాల్లోకి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం మీద కూడా ఆడిట్ చేయాలని జిల్లా అధికారులను కోరుతున్నాం. దీనిపై ఓ ప్రత్యేకమైన కమిటీ వేసి సమస్యను గుర్తించడమే కాదు.. దాని పరిష్కారాన్ని చూపేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం.

**సముద్రంలోకి వెళ్లి కాలుష్యాన్ని పరిశీలిస్తా** మత్స్యకారుల సమస్యపై ఏదో ఒకటి చెప్పి, చప్పట్లు కొట్టించుకొని వెళ్లిపోవడానికి నేను రాలేదు. మీలో ఒకడిగా సమస్యను వింటాను. అర్థం చేసుకుంటాను. నా సోదర మత్స్యకారులు తమ బాధలో ఏదైనా మాట అంటే పడతాను. ప్రస్తుత కాలుష్య సమస్య ఇప్పటిది కాదు. 2005 ప్రాంతంలోనే నక్కపల్లి సెజ్ కు, ఇక్కడి పరిశ్రమల స్థాపనకు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అనుమతులు ఇచ్చారు. గతంలో పెట్టిన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య సమస్యను పరిష్కరించేందుకు, అసలు క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని చూసేందుకు నేరుగా ఓ పడవలో సముద్రంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. మరో రెండు, మూడు రోజుల్లో ఇక్కడకు వచ్చి సముద్రంలోకి వెళ్లి కాలుష్య సమస్యను తెలుసుకుంటాను. మత్స్యకారులు మనసున్న వారు. ఎవరికీ అపకారం చేయాలని, పొట్ట కొట్టాలని అనుకోరు. వేటకు వెళ్లేవారికి కాస్త కోపం సహజం. ఆ కోపంలో నన్ను ఏమైనా అన్నా, పడటానికి నేను సిద్ధంగానే ఉన్నాను. అయితే పారిశ్రామిక వేత్తలను కొందరు రాజకీయ నాయకులు మత్స్యకారులను అడ్డు పెట్టుకొని బెదిరించినా, భయపెట్టినా సహించేది లేదు. మత్స్యకారులు కూడా అలాంటి వారి వలలో పడొద్దని కోరుతున్నాను. పరిశ్రమల కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతున్న వారికి ఎలాంటి పరిహారం అందాలి..? దానికున్న మార్గాలను కూడా విపులంగా చర్చిస్తాం.

**ఆక్వా రంగానిదీ రాష్ట్రంలో కీలకమైన స్థానం** రాష్ట్రంలో ఆక్వా రంగానిది కీలకమైన స్థానం. రూ.1.3 లక్షల కోట్ల ఆదాయం వస్తోంది. ప్రత్యక్షంగా 3.72 లక్షల మందికి, 15 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. అలాంటి ఆక్వా రంగంలోనూ కాలుష్య సమస్యలున్నాయి. గతంలో భీమవరంలో ఆక్వా పార్కు గురించి జరిగిన వివాదంలో పోలీసు కేసులు మిగిలాయి తప్ప, సమస్యకు పరిష్కారం రాలేదు. మత్స్యకారులకు సంబంధించిన పిఠాపురం నియోజకవర్గంలోని సమస్యకు పరిష్కార మార్గం రాష్ట్రం మొత్తం మీద ఓ రోల్ మోడల్ కావాలి. దీన్ని రాష్ట్రమంతటా అమలు చేసేలా సర్వ ఆమోదిత మార్గం తీసుకొస్తాం. జనసేన పార్టీ విధానం కూడా పర్యావరణానికి చేటు చేయని అభివృద్ధి ప్రస్థానం. దాన్ని కచ్చితంగా అమలు చేస్తాం. తెలంగాణ తరహాలో పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధి చేసే ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తాం.దానికి ముందున్న మార్గాలను వెతుకుతాం.

**తీర ప్రాంత రక్షణ గోడను నిర్మించే బాధ్యత తీసుకుంటాను** ఉప్పాడ ప్రాంతంలో మరో కీలకమైన సమస్య తీర ప్రాంత కోత నివారణ. ఏటా 20 నుంచి 25 మీటర్ల ప్రాంతం కోతకు గురవుతోంది. దీనిపై ఇప్పటికే దృష్టి సారించాం. వేగంగా తీర ప్రాంతం కోతకు గురవుతున్న నేపథ్యంలో కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ అధికారులు కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. దానికి పరిష్కార మార్గాలను సూచించారు. అధికారులు తీర ప్రాంతం రక్షణ గోడ నిర్మాణ నిమిత్తం రూ.323 కోట్లు అవసరం అవుతుందని ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు అయ్యాయి. ఈ నెల 14వ తేదీన మరో సమావేశం ఉంది. కచ్చితంగా కేంద్ర పెద్దలను ఒప్పించి అయినా ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణాన్ని ప్రారంభించే బాధ్యత నేను తీసుకుంటాను. అయితే భారీ స్థాయి నిధులు కావడంతో దశలవారీగా వచ్చేలా చూస్తాను. దీనిపై కేంద్రం సానుకూలంగానే ఉంది. దీంతో పాటు రూ.5.65 కోట్ల నిధులతో ఉప్పాడ %-% కోనపాపపేట మార్గం నిర్మాణం త్వరలో జరగనుంది. సముద్ర రక్షణ గోడ నా హయాంలోనే పూర్తవుతుంది. నా మీద నమ్మకం ఉంచండి. నేను మీలో ఒకడిగానే ఇక్కడి సమస్యలను పరిష్కరించేలా దృష్టి పెడతాను" అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నేత మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

## సీతంపేట బంజరలో పోషణ మాసం కార్యక్రమం







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, మండలంలోని సీతంపేట బంజర అంగన్వాడి కేంద్రంలో సి.డి.పి.ఓ, తోట, పద్మశ్రీ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ఎలా తయారు చేసుకోవాలని చక్కెర ఆయిల్ లేని ఆహారం తీసుకోవాలని ఆకుకూరలు మునగాకు ప్రాముఖ్యతను వివరించారు అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేశారు సూపర్వైజర్ పి, వెంకట్ రమణ అంగన్వాడి టీచర్లు. శారద నిర్మల రుక్మిణి లక్ష్మీ శాంతి . పంతులి గ్రామస్తులు పాల్గొన్నారు

## రామానుజన్ శ్రీధర్ స్వామి కి డాక్టరేట్.



**కూకట్ పల్లి,అక్టోబర్ 9(వార్తాప్రభ):**ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి ఆధ్వర్యంలో వ్యాకరణ "ప్రౌడనోరమాయ కృతవ్యాఖ్యాయ సమీక్షాత్మక మధ్యాయనమ్ ప్రౌడమామెరన్ పై జగన్నాతాయ వ్యాఖ్యాన విభాగంలో రామానుజం శ్రీధర్ స్వామి డాక్టరేట్ సాధించారు.న్యూబోయిన్ పల్లి సికింద్రాబాద్ కి చెందిన రామానుజం శ్రీధరస్వామి పిహెచ్.డి. తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న 'శ్రీ వేంకటేశ్వర "వేదాంత వర్ధిని సంస్కృత కళాశాలలో డిగ్రీ వరకు చదువుకొని అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ సంస్కృతం, తెలుగు పట్టు సాధించడమే కాకుండా నేడు పి.హెచ్.డి సాధించారు. రామానుజం శ్రీధర స్వామి డాక్టరేట్ సాధిచడంపై సంస్కృత కళాశాల ప్రధానాచార్యులు డా. బానోత్ సురేందర్ నాయక్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## ప్రైవేట్ చిట్టిలు నడిపిన వ్యక్తి చిట్టి అమౌంట్ చెల్లించనందుకు జైలు శిక్ష:

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం లీగల్:: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి పాటిల్ వసంత్ ప్రైవేటు చిట్టిలు నడిపి మోసం చేసిన వ్యక్తికి ఐదు సంవత్సరముల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా కొత్తగూడెం బస్తి చెందిన ఎండి. నిజాముద్దీన్ స్థానికంగా గంగా హుస్సేన్ బస్తి కి చెందిన జక్కుల వెంకన్న తన కుటుంబంతో గత కొన్ని సంవత్సరంల నుండి నివాసం ఉన్నందున పరిచయాలు బాగా పెరిగినందున మనిషికి రూ.ఒక లక్ష, రూ .ఒకటిన్నర లక్ష విలువగల చిట్టీ లు నిర్వహించాడు తనతో పాటు ఎల్.సుధ,పరపతి ,లక్ష్మణ్ రెడ్డి, పేరం నరేష్ , కోలా, సాల్మన్ రాజు, పరపతి వీరబాబు, మణమ్మ ,పెరుమాళ్ళు నాగేశ్వరరావు మరికొందరు మొత్తం 20 మంది కలిసి అతని వద్ద చిట్టీలు వేయించుకొని ఎటువంటి బాకీలు లేకుండా చెల్లించినప్పటికిని మొత్తం రూ.16, 41,000/- చెల్లించకుండా మోసం చేసి పారిపోయాడని కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 2017 నవంబర్ 25న అప్పటి ఎస్ ఐ. జి.తిరుపతికి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకోగా అప్పటి ఇన్స్పెక్టర్ కే. కుమారస్వామి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టులో 22 మంది సాక్షుల విచారణ అనంతరం జక్కుల వెంకన్న పై నేరం ఋజువు కాగా సెక్షన్ 420 ఐ.పి.సి. ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష , రూ.3,000/- ల జరిమానా, సెక్షన్ 5 తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్,1999 ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారగార శిక్ష మరియు రూ .3000/- ల జరిమానా మొత్తం 6000 జరిమానా చెల్లించాల్సిందిగా తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించ వలెనని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి నిర్వహించారు .కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్.ఐ. ఆర్. ప్రభాకర్, కోర్టు లైజాన్ ఆఫీసర్ నేరేడు వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పిసి కె.వీరన్న లు సహకరించారు.

## నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 9 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నానక్ రామ్ గుడాలో నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్, శంషాబాద్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా బజార్ వాలే కిషన్ సింగ్,అతని భార్య రేఖ భాయ్ లు స్కూటీ ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారా తరలిస్తుండడంతో పట్టుబడ్డారని తెలిపారు.నాటు సారాను దూల్ పేట నుండి నానక్ రామ్ గూడెం వద్ద పట్టుకొని నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేశామన్నారు.అలాగే నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.నాటు సారా రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.



## బ్యాంకు లావాదేవీలకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి- సిఐ శివశంకర్

**నారాయణపేట అక్టోబర్ 09 (వార్తాప్రభ)**నారాయణపేట జిల్లా కేంద్రంలోని వివిధ బ్యాంకుల వద్ద నారాయణపేట సీఐ శివశంకర్ , ఎస్ఐ వెంకటేశ్వర్లు లు కలిసి బ్యాంక్ ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించి, బ్యాంక్ కస్టమర్లకు పలు భద్రత పరమైన సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ - "బ్యాంక్‌లలో డబ్బు జమ, డ్రా చేసుకునే సమయంలో అపరిచితుల సహాయం తీసుకోవద్దు. మీ వ్యక్తిగత వివరాలు, ఓటిపి ఏటి ఎం పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు అని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అని సూచించారు.ఎస్ఐ వెంకటేశ్వర్లు బ్యాంక్ సిబ్బందికి సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా నిర్ధారించుకోవాలని, బ్యాంకుల వద్ద సెక్యూరిటీ భద్రతా గార్డులు అప్రమత్తంగా ఉండాలని, అందర్నీ నిశితంగా గమనిస్తూ ఉండాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలు, బ్యాంక్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు



## అవసరానికి వాడుకుని ఆ తర్వాత చంపేశాడు




**ఖమ్మం రూరల్, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** ఖమ్మం జిల్లా కేంద్రంలో గల నెలలో జరిగిన హత్య కేసును పోలీసులు విజయవంతంగా చేధించారు.కేసు వివరాలను గురువారం ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఇతర అధికారులతో కలిసి విలేక రులసమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పరిమి అశోక్ కొంతకాలంగా ఖమ్మం జిల్లాలో నివాసం ఉంటున్నాడు. ఖమ్మం అర్బన్ మండలం పల్లెలో వంగతోట సాగు చేసేవాడు. సాగులో నష్టాలు రావడం, అప్పులపాలు కావడంతో ప్రత్యామ్నాయ వ్యాపారం చేసేందుకు ఖమ్మం వచ్చాడు. ఈ క్రమంలో ఖమ్మం నగర కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయా గా పనిచేసే కొమ్ము నగ్మాతో అశోక్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త శారీరక సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు గ్రంథాలయం వద్ద అశోక్‌కు పరిచయం అయ్యాడు. కాలక్రమంలో వీరి పరిచయం స్వలింగ సంపర్కానికి దారితీసింది. అశోక్ రూమ్ కు వెంకటేశ్వర్లు తరచూ వచ్చిపోతుండేవాడు. వచ్చిన ప్రతిసారి అశోక్ కు ఆర్థిక సహకారం చేసేవాడు. అయితే ఏక మొత్తంలో ఒకేసారి వెంకటేశ్వర్లును చంపి అతడి వద్ద ఉన్న బంగారం, ఇతర ఆస్తులను చేజిక్కించుకోవాలనే దురుద్దేశ్యంతో అశోక్ కుట్రకు తెరలేపాడు. ఈ క్రమంలో బాలపేటలో తాను వ్యవసాయం చేస్తున్న సమయంలో పరిచయమైన పెంటి కృష్ణయ్య సహకారం తీసుకున్నాడు. వెంకటేశ్వర్లును ఎలా చంపాలి, చంపిన తర్వాత శరీర భాగాలను గుర్తు తెలియని ప్రదేశాల్లో ఎలా వేయాలి అనే అంశాలను యూట్యూట్‌లో సెర్చ్ చేశాడు. గత నెల 15వ తేదీన వెంకటేశ్వర్లు యాథావిధిగా అశోక్ రూమ్‌కు వచ్చి పడుకున్నాడు. నిద్రలో ఉన్న వెంకటేశ్వర్లును తెల్లవారుజామున అతి కిరాతంగా అశోక్ నరికి చంపాడు. మెడపై పలుమార్లు నరికి తల మొండెం వేరు చేశాడు. ఆ సమయంలో నగ్మాను రూమ్ బయట కాపలాగా ఉంచాడు.శరీరాన్ని ముక్కలుగా నరికిన తర్వాత ఆ భాగాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి కరోనావ్ గిరి ప్రాంతంలో పొదలు, చెత్తలో విసిరేశాడు. ఆ తర్వాత గదిలోని రక్తపు మరకలను శుభ్రపరిచినట్లు విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. నిందితులు ఏ-1 పరిమి అశోక్, ఏ-2 కొమ్ము నగ్మా, ఏ-3 పెంటి కృష్ణపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి రెండు తులాల గోల్డ్ చైన్, సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, బి.సాయికుమార్, కారేపల్లి ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ సంపత్, ఆనంద్, అంజి, రాజేశ్, ఉపేందర్, సైదాను ఏసీపీ అభినందించారు.

## వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి

### సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్.

**జగిత్యాల అక్టోబర్ 09 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** వృద్ధుల సంరక్షణ, సంక్షేమము, హక్కుల పరిరక్షణ కోసం వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గురువారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం లో విలేఖరు లతో ఆయన మాట్లాడారు. నిరా ధరణ కు గురవుతున్న వృద్ధుల హక్కుల పరిరక్షణ, పునరావసం, భద్రతకు, సమాజ హితానికి వారి నైపుణ్యాల ను ఉపయోగించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల కమిషన్ ఏర్పాటు చేస్తేనే వృద్ధులకు న్యాయం జరుగుతుందన్నారు.

## ఘనంగా కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 9 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని మల్కం చెరువు కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గురువారం 09 తేదీ నుంచి 11వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేద శాస్త్ర పండితులచే అంగరంగ వైభవం గా నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు,భక్తులు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపా కటాక్షములు పాత్రులై ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.అమ్మ వారి ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ఆర్డీవో,కలెక్టర్,తహసీల్దార్, పోలీసు ఉన్నత అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా రాయదుర్గం ప్రజలు కృత్ఞతలు తెలిపారు.

## ఆసుపత్రిలో వీరంగం సృష్టించిన వ్యక్తి అరెస్ట్ :ఎస్ఐ లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ అక్టోబర్ 09 (వార్తాప్రభ)** హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అక్టోబర్ 7వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చిట్టంపల్లి సురేష్ అనే వ్యక్తి ఆసుపత్రికి వచ్చి, విధుల్లో ఉన్న డాక్టర్లు, సిబ్బందిని బూతులు తిట్టి, అసభ్యంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు.

# ఎడిటోరియల్

## జగన్ కే ఓటేసి షర్మిలకు షాక్ ఇచ్చిన పచ్చ మీడియా

ఏపీలో రాజకీయం ఎలా సాగుతోంది అంటే అందరికీ తెలిసిందే. నాయకులు కంటే ముందు వారసులుగానే జనంలో ముద్ర పడుతున్నారు. అయితే ఈ వారసత్వం కూడా ఎంతో కొంత జవసత్వాలు ఉంటేనే నిలబడుతుంది. ఆ విధంగా చూస్తే వారసులమని చాలా మంది వస్తారు కానీ కొందరే జనం అభిమానం చూరగొంటారు. ఇదిలా ఉంటే ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ఏమిటి అంటే వైసీపీ అన్నా జగన్ అన్నా గిట్టని ఒక పచ్చ మీడియా ఇటీవల తన విశ్లేషణలో జగన్ కి కొంత సాఫ్ట్ కార్నర్ చూపించింది. బాలయ్య అసెంబ్లీ ఎపిసోడ్ లో ఆయనను విమర్శించే క్రమంలో జగన్ ని అలా అనడం తప్పు కదా అంటూ తనదైన కొత్త రాజకీయ విశ్లేషణ వినిపించింది.ఏపీలో రాజకీయం గురించి ఏ తీరున ముందుకు సాగుతోంది అన్న దాని గురించి కూడా సదరు మీడియా ఒక విశ్లేషణ చేసింది. ఈ క్రమంలోనే ఏపీలో వైఎస్సార్ రాజకీయ వారసత్వం జగన్ కే దక్కిందని తన కోణంలో ఒక వ్యాఖ్యానం చేసింది. ఆ విషయంలో కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెనకబడి ఉన్నారని కూడా చెప్పకనే చెప్పింది. నిజానికి చూస్తే వైఎస్సార్ వారసత్వం కోసం షర్మిల పోటీ పడుతున్న విషయం తెలిసిందే. వైఎస్సార్ ది కాంగ్రెస్ పార్టీ అని ఆయన కుమార్తెగా కాకుండా ఆయన ఆశయాలకు కూడా తానే అచ్చమైన వారసురాలిని అని షర్మిల ఎన్నో సార్లు చెప్పుకున్నారు. మరి ఆమెకు ఈ తరహా విశ్లేషణ మింగుడుపడేది కాదనే అంటున్నారు.అయితే ఇదేమీ కొత్త విషయం కాదని ఇప్పటికే రుజువు అయింది కదా అని వైసీపీ వర్గాలు అంటున్నారు. ఎపుడైతే వైఎస్సార్ మరణించారో నాటి నుంచే జగన్ లోనే ఆయనను ఏపీ జనాలు చూసుకుంటూ వచ్చారని అనేక ఎన్నికల్లో వైసీపీకి దక్కిన భారీ ఓటు బ్యాంక్ అందుకు నిదర్శనం అని కూడా చెబుతున్నారు. అంతే కాదు 2024 ఎన్నికల్లో ఓటమి పాలు అయినా వైసీపీ వెంట 40 శాతం ఓటు బ్యాంక్ నిలిచి ఉంది అంటే వైఎస్సార్ మార్క్ పాలిటిక్స్ జగన్ చేస్తున్నారని నమ్మిన వర్గాలు వేసిన ఓటు గానే దానిని చూడాలని అంటున్నారు.నిజం చెప్పాలీ అంటే వైఎస్సార్ వారసత్వం అంటూ జగన్ కాంగ్రెస్ నుంచి వేరుపడి సొంత పార్టీ పెట్టుకున్నపుడే ఏపీలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ మొత్తం ఆ వైపుగా వెళ్ళిపోయి హస్తం పార్టీకి అతి పెద్ద చిల్లు పడింది. ఇపుడు చూస్తే దానికి పూడ్చుకునే క్రమంలో కాంగ్రెస్ చేయాల్సినవి అన్నీ చేస్తూ వచ్చింది. చివరాఖరికి అతి పెద్ద ట్రంప్ కార్డుని సైతం ప్రయోగించింది. ఈ క్రమంలో వైఎస్సార్ తనయ అయిన షర్మిలను ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా చేసింది దీని వల్ల కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆశిస్తోంది చాలానే ఉంది. పోయిన తమ ఓటు బ్యాంక్ ని వైసీపీ నుంచి పొందాలన్నదే ఆ ప్లాన్. కానీ జరుతున్నది కానీ మీడియా విశ్లేషణలు కానీ జనాభిప్రాయం కానీ చూస్తే వైఎస్సార్ కి అసలైన రాజకీయ వారసుడు జగన్ అని తేలుతోంది. మరి ఏణ్ణర్థం పైగా పీసీసీ చీఫ్ గా ఉన్న షర్మిల ఈ విషయంలో సాధించింది ఏమినా ఉందా అన్నది కూడా కాంగ్రెస్ వర్గాలలోనే అతి పెద్ద చర్చగా ఉంది. చూడాలి మరి ముందు ముందు కాంగ్రెస్ ఏ రకమైన స్ట్రాటజీలు వేస్తుందో, షర్మిల ఏ విధంగా దూకుడు చేస్తుందో.

## జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి చేయండి

### కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎస్.ఆర్. శంకరన్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం అధికారులతో కలసి జర్నలిస్ట్ కాలనిలో పర్యటించారు. జర్నలిస్ట్ కాలనిలో నెలకొన్న సమస్యలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్, పాత్రికేయులు కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్.ఆర్. శంకరన్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. పెద్ద కాలువలో ఎక్కువ చెత్త నిలిచిపోవడం వలన ఇబ్బందిగా ఉందని ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, డి.ఈలు రమణ, శిల్ప ,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

## పొత్తం చెప్పిన సత్యాలు



శ్రేష్టులే జ్ఞానంలో
శ్రీమంతులు గుణంలో
అయితేనే గౌరవము
అగును బ్రతుకు సార్ధకము
గగనమంత ప్రేమలో
క్షమాగుణం మనసులో
ఉంటేనే బంధాలు
వెలుగుతాయి జీవితాలు
పుడమియంత సహనంలో
పసిపాపలా నవ్వులో
ఉండాలి నిరంతరము
కావాలి అగ్రస్థానము
ప్రతిదినం ధ్యానంలో
పెద్దవారి సేవలో
తరిస్తే బహు దీవెన
కడు క్షేమమే బ్రతుకున

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

# కేంద్ర ప్రభుత్వ జి ఎస్ టీ 2.0 సంస్కరణలపై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల కేంద్ర ప్రభుత్వం సాహసోపేతంగా..... ప్రయోగాత్మకంగా..... అమలు చేస్తోన్న జి ఎస్ టి తగ్గింపు విధానం సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్‌పై దేశవ్యాప్తంగా ఏ ఏ వర్గాల్లో ఎంతెంత ప్రయోజనం చేకూరిందో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలో జి ఎస్ టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలతో పాటుగా రోగులకు, ఉపయుక్తంగా ఉండేలా ఏ ఏ వస్తువులు, ఏ ఏ ఔషధాలుపై ఎంత శాతం జి ఎస్ టి తగ్గిందో ..హెల్త్ ఇన్స్పెక్టర్ ఎమ్ సోమరాజు మైకు ద్వారా ప్రచారం చేస్తుండగా ఈ ర్యాలీ సాగింది. పేదలకు మరింత అందుబాటులో ఉండేలా వైద్య సేవలు సూపర్ జి ఎస్ టీ సూపర్ సేవింగ్స్ప్రజా ఆరోగ్యంవిషయంలోప్రజా ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయంజీవిత/ ఆరోగ్య భీమా సేవలుగతంలో 18% ఇపుడు జీరో శాతం,పొదుపు మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్ ఇప్పుడుగతంలో 12%...నుండి7% వరకు 5% పొదుపు వివిధ రకాల మందులపైగతంలో ఇప్పుడు12% నుండి 7% నేడు వరకు 5%దృష్టి సరిచేసి కళ్ల అద్దాలుగతంలో 12%వరకు 5%7% పొదుపు ఇలా 36 రకాల ప్రాణ రక్షక, క్యాన్సర్,అరుదైన వ్యాధుల మందులపై పన్నులుగతంలో 12/5% ఉండగా నేడు 12% నుండి 0%జీవిత మరియు ఆరోగ్య భీమా పాలసీలపై గతంలో విధించిన 18% పన్ను పూర్తిగా మినహాయింపువ్యాధి నిర్ధారణ కిట్లు సంబంధిత పరికరాలు ఇపుడు 12% నుండి7% వరకు 5%పొదుపు మెడికల్ థరోమీటర్లు/మెడికల్ అనాలిసిస్ పరికరాలు గతంలో ఇప్పుడు 18% ఇప్పుడు 5% తగ్గి 13% పొదుపు మార్గం పట్టాయని ప్రజలకు అవగాహన కల్పించారు.జి ఎస్ టి 2.0 – ప్రజల ఆరోగ్య సంరక్షణకు వరాల జల్లు – వైద్య ఖర్చులలో భారీగా ఆదా జి ఎస్ టి – బెటర్ %ఁ% సింపుల్! అంటూ ఈ ర్యాలీ సాగింది.జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్క నెలలో మీరు ఎంతఆదా చేస్తున్నారో చూడండి అంటూ క్యూ ఆర్ కోడ్ వున్న కరపత్రాలు పంపిణీ చేశారు.డబుల్ ఇంజిన్ సర్కార్ – ఏపీలో డబుల్ బెనిఫిట్స్ – సూపర్ 6 %ఁ% జీఎస్టీ 2.6 ప్రాధాన్యత పట్ల అవగాహన ర్యాలీ పట్ల రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తో పాటుగా సివిల్ సర్జిన్ ఆర్ ఎమ్ ఓ వై పద్మావతి, డిప్యూటీ సివిల్ సర్జిన్ ఆర్ ఎమ్ ఓ ఎమ్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఆర్ ఎమ్ ఓ నాగార్జున, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎమ్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో సూపర్ లైఫ్

**- కొత్త సంస్కరణలతో సామాన్యులకు ఎంతో మేలు - ప్రజల ఆరోగ్య భద్రతకు సరికొత్త భరోసా**
**- జీవిత, ఆరోగ్య కుటుంబ బీమా, ప్రాణ రక్షక మందులపై సున్నా జీఎస్టీ - విప్లవాత్మక సంస్కరణలపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





విజయవాడ, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి) ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని.. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌తో సామాన్యుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.నగరంలోని ఓల్డ్ జీజీహెచ్ వద్ద గురువారం ఉదయం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జీఎస్టీ విజయవాడ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్.. అధికారులతో పాటు ఎన్టీఆర్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ 2.0తో వివిధ రంగాల్లో భారం తగ్గిందని.. జీవిత బీమాపై పాత రేటు 18 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందని, ఆరోగ్య–కుటుంబ బీమాలోనూ ఇదే రకమైన మినహాయింపు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లుపై 12 శాతం ఉన్న పన్ను 5 శాతానికి తగ్గిందన్నారు. ఈ సంస్కరణలతో జరుగుతున్న మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, రైతు సేవా కేంద్రాలు, అంగన్వాడీలు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిచోటా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఆదా అయిన సొమ్ము ప్రజల జీవితాలకు కొత్త దిశను చూపిస్తాయని, ఈ డబ్బు పెట్టుబడి కోసం, చదువుకోసం, డిపాజిట్ల కోసం.. ఇలా వివిధ రకాలుగా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కొత్త జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు దాదాపు రూ. 300 కోట్లు మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇంత మంచి అవగాహన కార్యక్రమంలో భాగస్వాములైన జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు, డయాగ్నిస్టిక్ కేంద్రాలు.. ఇలా ప్రతిచోటా కొత్త జీఎస్టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాలకు సంబంధించి అధిక ప్రయోజనాలు సామాన్యులకు చేరువవుతున్నాయన్నారు. జీవిత బీమాలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభిస్తుందని, ఆరోగ్య కుటుంబ బీమాలో ప్రతి రెన్యువల్‌లోనూ 18 శాతం ఆదా అవుతుందని వివరించారు. చికిత్సా ఖర్చులు, పరీక్షల ఖర్చులూ తగ్గుతాయని జేసీ ఇలక్కియ వెల్లడించారు.జీఎస్టీ విజయవాడ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. సాధారణ మందులపై పాత జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందని, టెస్టింగ్ కిట్లుపై పాత జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ రంగాల్లో జీఎస్టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య సేవల రంగంలో జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని వివరించారు.కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాధు ప్రసాద్, సెక్రటరీ డీవీఆర్ సాయికుమార్, ట్రెజరర్ జి.శ్రీహరిరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె. అనిల్ కుమార్, జీఎస్టీ గొల్లపూడి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.ప్రజ్ఞా రాధిక, ఆసుపత్రి వైద్యాధికారులు, జీఎస్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారాన్ని తీసుకురావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం పెనుమనేని పాలీ క్లినిక్ రోడ్ ఆటోనగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వర్షం పడిన కాసేపటికే పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్లో నీటి నిల్వలు ఎక్కువ మొత్తంలో ఉండటం, డిసిల్టింగ్ పనులు ఎన్ని చేసినప్పటికీ రోడ్డుమీద వర్షపు నీటి నిల్వలు అలాగే ఉండటం గమనించి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ కన్సల్టెంట్స్ తో దీనికి ఒక శాశ్వత పరిష్కారానికై పిన్నమనేని పాలిక్ క్లినిక్ రోడ్ పరిసర ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రైన్ల ప్రవాహానికి అడ్డొచ్చే ఆక్రమణలను, ఇరుకైన మార్గాలను తొలగించి, కాలువలను వెడల్పు చేసే ప్రక్రియ మొదలుపెట్టాలని అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన నిల్వ ఉండకుండా శరవేగంగా చర్యలు తీసుకొని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అప్పటివరకు మాన్సూన్ రెస్పాన్స్ టీమ్లను అప్రమత్తంగా ఉంచుతూ వర్షపునీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.తదుపరి ఆటోనగర్ లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ను పరిశీలించారు . సర్కిల్ 3 లోని వ్యర్థాలు సేకరించే ఆటోలు సర్కిల్ 2 అజిత్ సింగ్ నగర్ లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ కు వెళ్లి రెండో ట్రిప్ కు వచ్చి వ్యర్థాలు సేకరించేందుకు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నందున, సర్కిల్ 3 లోని ప్రాంతాలలో సేకరించే వ్యర్థాల క్లాప్ వాహనాలు సర్కిల్ 3 లోనే నిలుపుకొనేటకు ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో పార్కింగ్ చేసే చర్యలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కమిషనర్ తో పాటు చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ. సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి పాలక మండలి సమావేశం



**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 9( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి పాలక మండలి సమావేశం గురువారం ఆలయ చైర్మన్ చాంబార్ లో ఆలయ కార్యనిర్వాహణాధి. కిశోర్ కుమార్, చైర్మన్ జంగాల. శ్రీనివాసరరావు అధ్యక్షత సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ఆలయ అభివృద్ధి పై పలు అం శాల ను చ ర్చిం చి పలు తీర్మానాలు చేశారు,ఈ సమావేశం లో ఆలయ అధికారులు,పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా జనసేన పార్టీ.

**డిగ్రీ చదువుతున్న విద్యార్థినికి ల్యాప్ టాప్ అందించిన సామినేని ఉదయభాను .**



**విజయవాడ, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలో ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్న గగన్ కుమార్ కుమార్తె పొట్నూరి దేవికకు డిగ్రీ ఫస్ట్ ఇయర్ బిబిఏ చదువుతున్న సందర్భంగా లాప్ టాప్ అవసరమై, జనసేన పార్టీ నాయకులు పేటేటి నాంచారయ్య దృష్టికి తీసుకువెళ్ళారు, ఈ విషయమై స్పందించిన నాంచారయ్య నేడు నూతన లాప్ టాప్ ను విజయవాడలోని గురునానక్ కాలనీలోని జనసేన పార్టీ క్యాంపు కార్యాలయం నందు సామినేని ఉదయభాను చేతుల మీదుగా విద్యార్థినికి అందించారు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థినిని వారు దీవించారు,అలానే చదువుకునే విద్యార్థులకు జనసేన పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని సామినేని ఉదయభాను తెలిపారు.

## కొత్తపేట షేక్ రాజా హాస్పిటల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జి ఎస్ టి తగ్గింపు వల్ల పేద బడుగు బలహీన వర్గాలకు చేకూరే ప్రయోజనాలు గురించి ప్రభుత్వం ఆసుపత్రిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దానిలోభాగంగా ఎన్టీఆర్ జిల్లా సమన్వయ అధికారిడాక్టర్ మాధవి , డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జిఎస్టి టి ఎస్ వి ఎన్ వై భరత్ ల ఆధ్వర్యంలో గురువారం షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ హాస్పిటల్ లో అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ తదితర వైద్యులు మరియు వైద్య సిబ్బంది కొత్తపేట టీవీ యూనిట్ మరియు సచివాలయం సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు జీఎస్టీ 2.0 సంస్కరణలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ముక్యంగా రోగులకు ఉపయుక్తంగా వుండే వైద్య పరీక్షలు, పరికరాలు, ఔషధాలు తదితరాలపై ఎంతెంత శాతం జి ఎస్ టి తగ్గించారో రోగులకు మైకుల్లో ప్రచారం ద్వారా అవగాహన కల్పించారు.

## దసరా ఉత్సవాలు జయప్రదంగా జరిగేందుకు కృషిచేసిన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకి ధన్యవాదాలు

**స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడం సంతోషం.**
**జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో నగరానికి అవార్డులు తీసుకువచ్చిన కమిషనర్**
**విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏ ఐ టీ యు సీ) అభినందనలు**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత నెల 22వ తేదీ నుండి ఈనెల 2వ తేదీ వరకు నగరంలో ఘనంగా జరిగిన దసరా ఉత్సవాలను ఏ అవాంతరము లేకుండా ఏర్పాట్లు చేపట్టి జయప్రదం చేసిన మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర ఐఏఎస్ కి మరియు ఇతర అధికారులకు విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, మినిస్ట్రియల్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా గురువారం ఉదయం కమిషనర్ ఛాంబర్ నందు నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛము ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డును కూడా అందుకోవటం చాలా సంతోషమని అన్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ అవాంతరము జరగకుండా దసరా ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారని కొనియాడారు. విజయవాడ నగరం జాతీయస్థాయిలో కూడా అవార్డు పొందటం చాలా సంతోషమని అన్నారు. ధ్యానచంద్ర ఐఏఎస్ విజయవాడ నగరాన్ని జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో అవార్డులు వచ్చేలా చేయటం నగర ప్రజలకు గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షులు ఎస్వి. ఎస్ చలం, మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దారా రాంబాబు తదితరులు ఉన్నారు.

## కిశోర బాలికలకు వ్యాచరచన పోటీలు

**జగ్గంపేట, అక్టోబర్ 09 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** మండలంలోని రాజపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో కిశోర బాలికలకు గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలికాదినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలోని కిశోర బాలికలకు చైల్డ్ రైట్స్, ప్రొటెక్షన్, లింగ వివక్షత, సైబర్ సేఫ్టీ, ఋతు స్రావంలో ఎదుర్కొనే రుగ్మతలు,రక్త హీనత, బాల్య వివాహాలు అంశాలపై పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె. సుబ్బారావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ అమ్మజీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధించండి.

**మీడియా అక్రెడిటేషన్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి -ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్**

**పొదలకూరు అక్టోబర్ 9 (వార్తాప్రభ)** గత ప్రభుత్వాల హయాంలో ఉన్న జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ యాదవ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నెపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ రామ్ మాట్లాడుతూ నెల్లూరు పున్నమి పత్రిక ఎడిటర్ కోటేశ్వరరావు సతీమణి అకాల మరణానికి చింతిస్తూ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారిని పరామర్శించడం జరిగినదని పేర్కొన్నారు.అలాగే ఈ సందర్భంగా ప్రజల సంక్షేమం కోసం అనేక జీ.ఓ.లను విడుదల చేసే ప్రభుత్వాలు మీడియా అక్రిడిటేషన్ జీ.ఓ. ఇచ్చి, నోటిఫికేషన్ విడుదల చేయడంలో తీవ్ర ఆలస్యం చేస్తూ ఉండటం వల్ల వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతా భావానికి గురి అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



వర్కింగ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రాని మీడియా జర్నలిస్టులు అందరికీ సులభతరంగా అక్రిడేషన్ మంజూరు అయ్యే విధంగా జూలై లో ఇచ్చిన జీవో ప్రకారం తక్షణమే నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న జర్నలిస్టు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ,, సంక్షేమ నిధి తక్షణమే పునరుద్ధదించాలని, జర్నలిస్ట్ హెల్త్ కార్డు పరిమితి రెండు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలని శ్రీ రామ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాక ఇంటి నిర్మాణానికి తగు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు పెన్షన్స్ సౌకర్యం అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వర్కింగ్ మీడియా ప్రతినిధులకు 15,000 పెన్షన్ సౌకర్యాన్ని కలిగించాలని ఆయన కోరారు. జర్నలిస్టుల మీద, పత్రిక కార్యాలయాల మీద దాడులు జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే మీడియా దాడుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఎం.పీ.ఎ నెల్లూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కామంచి హాజరత్ ప్రధాన కార్యదర్శి మేకల ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు కల్లూరు సుధాకర్ రెడ్డి మరియు ఏ.పీ.ఎం.పీ.ఎ కుటుంబ సభ్యులు పొదలకూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొనడం జరిగినది.

## మా గోడు వినండి ప్రభుత్వానికి.. లారీ ఓనర్ల విజ్ఞప్తి..

**21 వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 09 (వార్తా ప్రభ ప్రతినిధి):**బూడి చెరువు నుంచి 40 ఏళ్లుగా ఉచితంగా బూడిదను తరలించుకుంటూ జీవనం సాగిస్తున్న లారీ యజమానులు, డ్రైవర్లు తమ నిరసనను 21 వ రోజు కొనసాగిస్తున్నారు. గతంలో ఉచితంగా లోడ్ చేసిన డాక్టర్ ఎన్ టి టి పి ఎస్.ఇప్పుడు బూడిదను ప్రైవేట్ పరం చేసి కార్పొరేట్ సంస్థకు అప్పగించి, రూ.3 వేలకు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని వారు ఆరోపించారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు...? కాలుష్యం మాకు లాభాలు కార్పొరేటర్ సంస్థగా ఇదెక్కడి న్యాయం.వెయ్యి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మనమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులం

**● కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటాం ● పాల్వాయిగేట్ ఈవీఎం ధ్వంసం ఘటనలో నంబూరి శేషగిరిరావు వీరోచితంగా పోరాడారు ● కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మాట్లాడిన మంత్రి లోకేష్ ● శేషగిరిరావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ**







**ఉండవల్లి: అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మనమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులం అని, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కార్యకర్తలను నేరుగా కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తున్న మంత్రి లోకేష్.. నేడు ఉండవల్లి నివాసంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుండగా పోలింగ్ ఏజెంట్ గా ఉన్న శేషగిరిరావు వీరోచితంగా పోరాడి అడ్డుకున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడి ఆయనను తీవ్రంగా గాయపరిచారు. రెండు నెలల క్రితం ఆయన గుండె పోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో దివంగత శేషగిరిరావు సతీమణి కృష్ణవేణితో పాటు కుమారుడు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకున్న మంత్రి లోకేష్.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**నంబూరి శేషగిరిరావు మా అందరికీ స్ఫూర్తిగా నిలిచారు** ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. పాల్వాయిగేట్ ఈవీఎం ధ్వంసం ఘటనలో నంబూరి శేషగిరిరావు చాలా గట్టిగా పోరాడి మా అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తామంతా శేషగిరిరావు కుటుంబానికి అండగా ఉంటామని, కుటుంబ బాధ్యతను వ్యక్తిగతంగా తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

## పిడుగుపాటుకు గురై వ్యక్తి మృతి



**చేజర్ల అక్టోబర్ 9 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లా చేజర్ల మండలం బోడిపాడు గ్రామంలో పిడుగుపాటుకు గురై వెంకట కృష్ణారెడ్డి అనే వ్యక్తి ధర్మన్న చెందాడు ఈయన కాకినాడకు చెందిన వారు.ఈయన ఇటీవల బోడిపాడు లో పొలం కొనుగోలు చేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు గురువారం మధ్యాహ్నం పొలంలో పనిచేస్తుండగా ఆకస్మికంగా పిడుగు పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు ఈ ఘటనతో గ్రామాల్లో విషాదఛాయలు అలుము కున్నాయి.సమాచారం తెలిసిన వెంటనే గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేశారు.

# సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నాం...

**● హాస్టల్ విద్యార్థుల విద్య ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి... ● పేద విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దండి... ● హాస్టల్ నిర్వహణ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి...● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**





**విజయవాడ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని, విద్యార్థుల సంక్షేమ, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేలా సంక్షేమ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.

జిల్లాలోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, గురుకుల వసతి గృహాల నిర్వహణపై జిల్లా సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గురువారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రం సమావేశ మందిరం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 సాంఘిక సంక్షేమ వసతి గృహలు, 26 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహలు, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలు, 2 మైనార్టీ సంక్షేమ వసతి గృహల పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. వసతి గృహ విద్యార్థుల భవిష్యత్ సంక్షేమ అధికారులపై ఉందన్నారు. చిన్నతనంలో తాను కూడా హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసించి ఈ స్థాయికి ఎదిగిన వాడినేనన్నారు.. సంక్షేమ వసతి గృహ నిర్వహణ విద్యార్థుల ఇబ్బందులు స్వయంగా తెలిసిన వాడినన్నారు... తాను ఉన్న హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థుల భవిష్యత్‌పట్ల అత్యంత శ్రద్ధ కనపరిచేవారని విద్యతో పాటు ఆరోగ్యం క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని ఎప్పటికి తన మనసులో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. సంక్షేమ వసతి గృహ అధికారులు గురుతర భాధ్యతను గుర్తెరిగి మరింత భాధ్యతాయుతమైన సేవలందిస్తూ ఆశించిన ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వానికి పిల్లల విద్య ఆరోగ్యమే ముఖ్యమని ప్రత్యేక అధికారులు వారానికి ఒక రోజు హాస్టల్స్‌ను సందర్శించి నిర్వహణలో లోపాలను గుర్తిస్తే సరిచేసేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కాచి చలార్చిన నీటిని వినియోగించాలన్నారు. హాస్టల్స్‌కు సరఫరా చేసే మినరల్ వాటర్ ప్లాంట్లను వాటర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హాస్టల్ నందు ఆహారాన్ని తనిఖీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అధికారులు వసతి గృహ సంక్షేమ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రతి విద్యార్థికి కేర్ షీట్‌ను నిర్వహించాలన్నారు. వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యసించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలించాలని ప్రతి వసతి గృహంలోను ఎటిఎం కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలన్నారు. విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు ద్వారా మొక్కలు నాటి సంరక్షించే భాధ్యతను అప్పగించాలన్నారు. వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని.. ఆలసత్వం వహిస్తే సహించబోనన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి హాస్టల్స్ నిర్వహణలో మంచి ఫలితాలను సాధించే అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తానని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహం, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ అధికారి ఎం. రమదేవి, మైనార్టి సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, గురుకుల విద్యాలయ సంక్షేమ అధికారి ఏ.మురళికృష్ణ, వెనకబడిన సంక్షేమ అధికారి కె. లక్ష్మీదేవి, సహాయ సంక్షేమ అధికారులు వి. గణేష్, టి. గాయత్రి, ఎం.ఇజ్రాయిల్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## బాణాసంచా తయారీ కేంద్రాలపై విస్తృత తనిఖీలు

**● రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బాణాసంచా మృతదేహాల పరిశీలన ● మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం ● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**





**రామచంద్రపురం, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి):** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం శ్రీ లక్ష్మి గణపతి బాణాసంచా కేంద్రంలో జరిగిన అగ్ని పమాదంలో మృతి చెందిన వారి పార్థివ దేహాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం రామచంద్రపురంలోని ఏరియా ఆసుపత్రిలో పరిశీలించారు. బాణా సంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరు పోవడం పట్ల మంత్రి సుభాష్ విచారం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ బాణాసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ పోరెన్సిక్ ల్యాబ్ కు తరలించామన్నారు. బాణాసంచా తయారీకి సంబందించిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికి ఈ ప్రమాదం జరగడం, ఈ ప్రమాదం లో యజమానితో సహా ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. బాణాసంచా తయారీ కేంద్రం తమ శాఖ పరిధిలోనికి రాకపోనప్పటికి మృతుల కుటుంబాలకు ఎస్ డి ఆర్ ఎఫ్, ఇన్సూరెన్స్, చంద్రన్న భీమా తదితర పధకాలతో ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. దీపావళి సందర్భంగా బాణాసంచా తయారీ కేంద్రాల యజమానులు అన్ని జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు, విస్తృత తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. మంత్రి సుభాష్ వెంట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతకు చెకుముకి సైన్స్ సంబరాలు

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 9 (వార్తా ప్రభ ప్రతినిధి):** చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వి.మురళీ మోహన్ తెలిపారు. కొండపల్లిలోని డాక్టర్ మోహన్ రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ లో గురువారం చెకుముకి సైన్స్ సంబరాలు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సహకారంతో కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతంగా నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి, శాస్త్ర సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు, సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించడానికి తోడ్పడే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 8, 9,10 తరగతి తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ఎస్.నాగరాజు, ఎస్.కె.సర్దార్ సాహెబ్, ఎస్.డి.మస్తాన్ వలీ, బి.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జరిగిన మెగా డైరెక్టర్ వివి వినాయక్ జన్మదిన వేడుకలు

**ప్లకార్డులతో దర్శకుడు వినాయక్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఈతకోట గ్రామ ప్రజలు.**





**రావులపాలెం, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి).** ఘనంగా నిర్వహించిన దర్శకుడు వివి వినాయక్ జన్మదిన వేడుకలు ఎన్నో విజయవంతంమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించి సినీ రంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించిన ప్రముఖ సినీ దర్శకుడు వివి వినాయక్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు గురువారం నాడు మెగా డైరెక్టర్ వినాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో వివి వినాయక్ సేవా యాత్ సర్కిల్ అధ్యక్షులు గండ్రోతు దుర్గాసురేష్. గండ్రోతు వీరగోవిందరావు ఆధ్వర్యంలో ఆయన గోత్ర నామాలతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి జన్మదిన వేడుకలను నిర్వహించారు స్థానిక గ్రామ పంచాయతీ వీధిలో గల కమ్యూనిటీ హాల్ రామాలయం వద్ద కేక్ కట్ చేసి. ప్లకార్డులతో ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరెన్నో మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు. యువకులు. అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## వీ.ఆర్.ఏ ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు వినతిపత్రం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 09(వార్తా ప్రభ ప్రతినిధి):**ఎన్టీఆర్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న వీఆర్ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ లక్ష్మి శా కు వీఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్ఎల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిలపరపు మధుబాబు మాట్లాడుతూ మాట్లాడుతూ అర్హులైన వీఆర్ఎల సీనియారిటీ జాబితా ప్రకటించి వీఆర్ఏ లకు అటెండర్,వాచ్మెన్, డ్రైవర్లు,రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్ లు కల్పించాలని కోరారు.ఎన్నో సంవత్సరాలుగా కేవలం 10,500 జీతంతో కుటుంబ పోషణ భారంగా ఉందని, ప్రభుత్వ కార్యక్రమాలలో అన్ని సంక్షేమ పథకాల అమలులో మా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. తక్షణమే స్పందించివీఆర్ఏ లకు న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మన్నెం పరదేశీ,వీఆర్ఏ లు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో పోషణ మాసోత్సవ కార్యక్రమం



**చేజర్ల అక్టోబర్ 9 (వార్తాప్రభ)** మండలంలోని గొల్లపల్లి పంచాయతీలు పోషన్ మాసోత్సవ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు సిడిపిఓ పి. సునీలత ఆదేశాల మేరకు చేజర్ల సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ సూచనలు సలహాలు మేరకు నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ఎలా తయారు చేసుకోవాలో అని తెలిపారు అలాగే చక్కెర ఆయిల్ లేని ఆహారం తీసుకోవాలని ఆకుకూరలు మునగాకు యొక్క ప్రాముఖ్యతను వారికి వివరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు పిల్లలు అంగన్వాడీ కార్యకర్తలు బి.విజయ కుమారి పి.పద్మ పోలమ్మ తిరుపతమ్మ తదితర గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సయ్యద్ బాషా ని కలిసి అభినందనలు తెలియజేసిన బిజెపి కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్ యాదవ్

**వార్తా ప్రభ, గుడివాడ**

## ఆకులమన్నాడు లో పశువైద్య శిబిరం



**పెడన అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పెడన నియోజకవర్గం గూడూరు మండల పరిధిలోని ఆకులమన్నాడు గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గూడూరు వెటర్నరీ డిస్పెన్సరీ క్లినిక్ పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మొహమ్మద్ రఫీతో కలిసి గూడూరు డీసీ ఛైర్మెన్ పోతన స్వామి ప్రారంభించారు. శిబిరంలో 50 గేదెలు, 5 ఆవులు, 65 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు

## కొమాళ్ళపూడి పిఎసిఎస్ అధ్యక్షునిగా కూనసాని నాగబాబు...



**కృత్తివెన్ను, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం కొమ్మలపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ( పి ఎ సి ఎస్ ) అధ్యక్షునిగా ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన కార్యదర్శి కూనసాని నాగబాబును నియమిస్తూ గురువారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా కూనసాని నాగబాబును అభినందిస్తూ వివరణ కోరగా, జనసేన పార్టీలో కష్టపడి పని చేసిన వారందరికీ కచ్చితంగా గుర్తింపు దక్కుతుందని, చిన్నచిన్న ఒడిదుడుకులు వచ్చినప్పటికీ, వాటిని అర్థం చేసుకున్న ప్రతి జనసైనికుడు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని , దానికి ఉదాహరణగా తానేనని తెలియజేశారు. తనకిష్టమైన రైతులకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించి, తన ఈ నియామకానికి సహకరించిన ప్రతి నాయకుడికి కార్యకర్తకు అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. జనసేన పార్టీ స్థాపించిన దగ్గర్నుంచి పార్టీ కోసం కష్టపడి ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ దగ్గర నుంచి ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, అనేక సేవా కార్యక్రమాలు, దైవ కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల్లో అన్నింట తానే ముందుండి నడిపించిన నాగబాబుకు పదవి భరించడంతో జనసైనికులు సంబరాలు చేసుకున్నారు....

## ఓట్లు చోరీ కి పాల్పడిన నరేంద్ర మోడీ గద్దె దిగాలి

**ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్**

**మైలవరం లో కరపత్రాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు**





**మైలవరం అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:ఓట్లు చోరీ కి పాల్పడిన నరేంద్ర మోడీ గద్దె దిగాలని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా ఎన్డీఏ కూటమికి సహకరిస్తున్న ఈసి (ఎన్నికలసంఘం) తీరు కు వ్యతిరేఖంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ గద్దె చోడ్ పోరాటంనకు మద్దత్తుగా పీసీసీ అధ్యక్షులు వైస్ షర్మిల రెడ్డి ఆదేశానుసారం గురువారం మైలవరం పట్టణం లో స్థానిక నాయకులతో కలసి బొర్రా కిరణ్ కరపత్రంలు పంచుతూ ప్రజలనుంచి సంతకాల సేకరించారు.ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూ అధికార బీజేపీ పార్టీతో ముఖ్యం గా మోడీ, అమిత్ షా లతో కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కు అయ్యిందని ఆరోపించారు. ఎన్నికలపై లేవనెత్తిన సందేహాలు ఆరోపణలకు ఎలక్షన్ కమిషన్ సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ, ప్రజల ఓట్లను దోచుకుని బీజేపీ కూటమి ప్రభుత్వం మూడో సారి గద్దెనెక్కిందన్నారు.ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడి, లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి, బీజేపీ ఓట్ చోరికి పాల్పడిందనీ,దీని వల్ల నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోకుండా, వారికి నచ్చిన నాయకులను ఎన్నుకునే అధికారాన్ని కోల్పోయారన్నారు.ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు తమ ఓటును హక్కుగా పొందాలనేది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని,కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పలు డిమాండ్లను కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు పెట్టిందన్నారు.ఫోటోలతో స్పష్టమైన ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉండాలని,ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించిన వివరాలు బహిరంగ పరచాలని, తొలగించిన ఓట్లలో తప్పులు దొర్లితే సమస్య పరిష్కానికి ఫిర్యాదుల వ్యవస్థ అందుబాటులో ఉంచాలని,ఎన్నికలకు చివరి నిమిషంలో ఓట్ల తొలగింపు లేదా చేర్పుల ను నివారించాలని,స్పష్టమైన కట్ ఆఫ్ తేదీని ముందుగానే ప్రకటించాలనీ, ఉద్దేశ్య పూర్వకంగా ఓట్ల తొలగింపుకు పాల్పడిన అధికారులు/ఏజెంట్ల మీద చర్యలు తీసుకోవాలనేవి డిమాండ్లు అన్నారు.ఒకే వ్యక్తి – ఒకే ఓటు మా పోరాటం' అని,అధికార పార్టీతో కుమ్మక్కైన ఎన్నికల సంఘం పారదర్శకత లేకుండా ఓట్లను తొలిగించిందని ఆరోపించారు.అక్ర మార్కులను శిక్షించాలని రాహుల్ గాంధీ చేపట్టి న ఈ పోరాటానికి మద్దత్తుగా ప్రతిఒక్కరూ రాహుల్ కు మద్దతుగా ఉండి ప్రజలు ఓటు హక్కును కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శీలం రామకృష్ణ, దోసపాటి గిరి కుమార్, పిట్టల నాగేశ్వరావు, అన్నవరపు దుర్గారావు,బండి చంటి (పొందుగుల), అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 68 మందికి 36 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**నూజివీడు , అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి సీఎం సహాయనిధి కింద 68 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.36 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యంగా అనారోగ్యం, ప్రమాదాలు, ఆకస్మిక అత్యవసర పరిస్థితుల్లో సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం అనేక కుటుంబాలకు ఊరటనిస్తోంది" అని తెలిపారు.

## మండల స్థాయి బాలికల ఆటల పోటీలు ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 09(వార్తా ప్రభ ప్రతినిధి)**: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్,మండల స్థాయి ఆటల పోటీలు, జడ్పీహెచ్ఎస్ బాలికొన్నత పాఠశాల లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని –2 మాలిని,పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత ప్రారంభించారు. మండల కోఆర్డినేటర్,టి. సురేంద్ర బాబు ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు, కబడ్డీ,కోకో, వాలీబాల్, బ్యాట్మెంటన్, యోగా, చెస్, వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి సుమారుగా 300 మంది బాలికలు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖ అధికారిని –2 మాలిని మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లోనూ, ఆటల్లోనూ, పోటీ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థునులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం సిగ్గుచేటు...

**ఉత్తరాంధ్ర పర్యటన సిగ్గుచేటు...**






**అమరావతి అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిత్తూరు జిల్లా వెదురు కుప్పం లో వైసీపీ నేతల డైరెక్షన్లోనే అంబేద్కర్ విగ్రహం ధ్వంసం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు విజయవాడలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా పాతర్ల రమేష్ మాట్లాడుతూ అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి తమ ప్రభుత్వంపై బురద దానికే వైసిపి కుట్ర పన్నుతుందని ఇలాంటి వైసీపీ నీచ సంస్కృతిని ప్రజాసంఘాలు కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు జగన్ వ్యక్తిగత ప్రయాణ కోసమే తమ ప్రభుత్వం పైన విష ప్రచారం చేస్తున్నారని ఆయన నవిమర్శించారు పిపిపి విధానము ప్రైవేటుకరణకు తేడా తెలుసుకోకుండా జగన్ వ్యక్తిగత ప్రజల కోసమే నిందలు వేయటం మానుకోవాలని ఆయన హెచ్చరించారు పి పి విధానము నిర్ణయాలను జగన్ కు బాధపడకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు రాష్ట్రంలో మెడికల్ కాలేజ్ పై జగన్ విష ప్రచారం చేసేందుకే ఉత్తరాంధ్ర పర్యటన చేయటం సిగ్గుచేటని ఆయన అన్నారు జగన్ ఐదేళ్లు దుర్మార్గపాలన చేశాడని జగన్ చేసిన పాపాలు ఆత్మ పరిశీలన చేసుకోని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు మెడికల్ కాలేజీ పైన అంత ప్రేమ ఉంటే దళితుడైన డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగినందుకు పోలీసులతో నడిరోడ్డుపై కొట్టించే హింసించి చంపేంత వరకు ప్రయత్నించిన జగన్కు మెడికల్ కాలేజీలపైన ఎంత ప్రేమ ఉందో ? అందరికి తెలుసని ఆయన అన్నారు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు పై తమ ప్రభుత్వంపై జగన్ విషం కక్కుతున్నాడని ఆయన విమర్శించారు అంబేద్కర్ విగ్రహాన్ని నిరసన ధ్వంసంచేసి ప్రభుత్వల మీద బురద చట్టడానికి జగన్ ప్రయత్నం చేస్తున్నాడని ఆయన మరణించారు తెలుగు వైద్య కళాశాలలో పిపిపి లో నిర్మిస్తే తప్పేంటని నిధుల కొరత కారణంగా ఆ నిర్ణయం తీసుకున్నామన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు వర్మ దేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పరిశపోగు రాజేష్ రత్నాకర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## చిక్కవరం డ్వాక్రా మహిళలకు గన్నవరం ఎమ్మెల్యే నే దిక్కు




**గన్నవరం: అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గన్నవరం మండలం, చిక్కవరం గ్రామంలో సమత గ్రామైక్య సంఘం బుక్ కీపర్ పీకా నరసమ్మ చేసిన అక్రమాలు, అన్యాయాలపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టి సారించి, తగు విచరణ జరిపించి, చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సంఘాలు సభ్యులు కోరుతున్నారు. చిక్కవరం డ్వాక్రా మహిళలు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కార్యాలయంలో, గన్నవరం ఏపీఎం కార్యాలయంలో బుక్ కీపర్ పీకా అక్రమాలపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఏపీఎం మహిళలకు బుక్ కీపర్ పై విచారణ చేసి, తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు మహిళలు తెలిపారు. ఈ క్రమంలో డ్వాక్రా ఎజిఎం గ్రామంలో విచారణకు వస్తున్నట్లు తెలియడంతో పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులను బుక్ కీపర్ పీకా నరసమ్మ ఇంటికి వెళ్ళి వారిని విచారణకు హాజరు కావద్దని, ఒకవేళ హాజరైతే తనకు బాకీ ఉన్న నగదు మొత్తాన్ని వెంటనే చెల్లించాలని వత్తిడి తెస్తున్నట్లు డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపడితే ఎక్కడ తన అక్రమాలు బయటపడతాయో అని గ్రామంలో బుక్ కీపర్ హడావుడి చేస్తోందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ఈ సమస్యను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాత్రమే పరిశరించగలరని వారు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే యార్లగడ్డ గన్నవరం పర్యటన నేపథ్యంలో ఆయనను కలిసి తమ గోడు చెప్పుకోవాలని చూస్తున్నారు. బుక్ కీపర్ పీకా నరసమ్మ పై అధికారులు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చిక్కవరం డ్వాక్రా మహిళలు మాత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తమ సమస్య పరిష్కారం చేసి, తమకు న్యాయం చేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు.

## ఆకాశమే హద్దుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు

**పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్**





**బాపట్ల, అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆకాశమే హద్దుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే స్కై డీప్ ముఖ్య ఉద్దేశమని, బాపట్ల పార్లమెంట్ సభ్యులు లోక్సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు.గురువారం బాపట్లలోని ఎంపీ కార్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ గురించి సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో రేపల్లె పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, అద్దంకి పాలిటెక్నికల్ ప్రిన్సిపల్,నిజాంపట్నం ఐటిఐ ప్రిన్సిపాల్, గూడవల్లి ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్, ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్కిల్ స్కిల్ డెవలప్మెంట్ పైలెట్ ప్రాజెక్టులుగా రేపల్లె పాలిటెక్నిక్ కాలేజీ, అద్దంకి పాలిటెక్నిక్ కాలేజీ, నిజాంపట్నం ఐటిఐ, గూడవల్లి ఐటిఐ కాలేజీలలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన భవనాలు యంత్ర సామాగ్రి, ఫర్నిచర్, ఫ్యాకల్టీ కోర్సుల వివరాలను తనకు తెలియజేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అధికారు లనుకోరారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ బాపట్ల జిల్లా అధికారిని ఎం మాధవి, రేపల్లె, అద్దంకి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్, గూడవల్లి నిజాంపట్నం ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్, బాపట్ల ఎంపీ కార్యాలయం ఓ ఎస్ డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సమాఖ్య మహిళల అవగాహన సదస్సుకు విశేష స్పందన







**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో పశ్చిమ లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు, డ్వాక్రా మహిళలకు ఆర్థిక, ఆరోగ్యపరమైన అంశాలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. కేదారేశ్వరపేట, ఫ్రూట్ మార్కెట్ ప్రాంతంలోని విఎంసీ కళ్యాణ మండపం లో మూడో రోజు నిర్వహించిన వర్క్ షాప్ లో స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఒమేగా అను మై బేబీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక , వరుణ్ మోటార్స్ హెచ్ ఆర్ పవన్ కుమార్, పవర్ గ్రిడ్ ట్రైనర్ ఇంచార్జ్ సైదులు నాయక్, పిళ్ళైయార్ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ఎం గాయత్రి ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలకు ఆరోగ్యపరమైన, నైపుణ్యాభివృద్ధి పరమైన అంశాలను వివరించారు.ఈ సందర్భంగా వరుణ్ మోటార్స్ హెచ్ ఆర్ ఎమ్ పవన్ కుమార్ మాట్లాడారు, డిగ్రీ, డిప్లొమా , ఐటిఐ అర్హత కలిగి 28 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హతను బట్టి సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్, పెయింటర్, సర్వీస్ అడ్వైజర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉన్న మహిళల కొరకు టెలికాలర్ వంటి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు.అర్హత ఆశక్తి ఉన్నవారు పశ్చిమ ఎన్డీఏ కార్యాలయంలో సంప్రదించాలని వరుణ్ మోటార్స్ హెచ్ ఆర్ ఎమ్ పవన్ కుమార్ తెలిపారు.పవర్ గ్రిడ్ ట్రైనింగ్ ఇంచార్జ్ సైదులు నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోనే మొదటిసారిగా పశ్చిమ నియోజకవర్గంలో ఎనర్జీ స్మార్ట్ మీటర్స్ వర్క్స్ పై అవగాహన కల్పిస్తూ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా డిజిటల్ మార్కెటింగ్, అసిస్టెంట్ హెయిర్ స్టైల్స్, బ్యూటీషియన్, అసిస్టెంట్ ల్యాండ్ సర్వేయర్ , ఎలక్ట్రీషియన్ వంటి తదితర అంశాలపై శిక్షణనిస్తున్నామని 18 నుండి 40 సంవత్సరముల లోపు ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు పశ్చిమ ఎన్డీఏ కార్యాలయంలో కానీ రోటరీ నగర్ లోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ లో కానీ సంప్రదించాలన్నారు.ఒమేగా అను మై బేబీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక మహిళలు ఎదుర్కొంటున్న పలు అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు ఈ నెల 11 వ తేదీ శనివారం కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్, విఎంసి కళ్యాణమండపంలో జరగనున్న మెగా ఉచిత వైద్య శిబిరంలో అందుబాటులో ఉంటానని గైనకాలజీ, క్యాన్సర్, స్త్రీలకు సంబంధించిన వివిధ అనారోగ్య పరమైన విషయాలను నివృత్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి , 35 వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు బుధాల నంద కుమారి, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది రియాజ్ సుల్తానా, మోహనలక్ష్మి, ఆర్ పి లు సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు

## సతీ వియోగం చెందిన వేణుగోపాల్ రెడ్డిని పరామర్శించిన గన్నే, ప్రసాద్ (అన్నా),



**రెడ్డిగూడెం అక్టోబర్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:రెడ్డిగూడెం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుజానలపాటి.వేణుగోపాల రెడ్డి సతీమణి జానలపాటి స్వరాజ్యం ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగన్నె ప్రసాద్(అన్నా) రెడ్డిగూడెంలో ని జానలపాటి వేణుగోపాల్ రెడ్డి స్వగృహం లో ఆయనను కలసి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

**శ్రీమతి స్వరాజ్యం మరణ వార్త చాలా బాధాకరం.** ఆమె ఒక మంచి గృహిణి మాత్రమే కాకుండా,ప్రజల పట్ల మమకారం కలిగి వేణుగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణంలోఅండగా నిలిచారని,ఆమె లేని లోటు భర్తీ చేయలేనిదని,దేవుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని,కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని,తన మనఃపూర్వక ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో..ఎన్టీఆర్ జిల్లా,తెలుగు యువత ఉపాధ్యక్షులు.కిరణ్ కుమార్ రెడ్డి రెడ్డిగూడెం మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఉయ్యూరువెంకటేశ్వర రెడ్డి(పెద్ద బాబు) తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు.పామర్తి. శ్రీనివాస రావు బాలకృష్ణారెడ్డి రెడ్డిగూడెం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు పోతురాజు బాలకృష్ణ ,మైనార్టీ నాయకులు మైనార్టీ నాయకులు,షేక్ గాలీషా పడిశాల. సురేష్ మల్లాది.నాగభూషణం తదితరులు పాల్గొని సానుభూతి తెలియజేశారు...

## పెనుగంచిప్రోలు లో వాహనాలు తనిఖీ

**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 9( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో ఎస్ ఐ అర్జున్, ట్రయినింగ్ ఎస్ ఐ. గిరి సాయిల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ నిర్వహించారు.పెనుగంచిప్రోలు మక్కపేట రోడ్డు, ఇండియన్ ఆయిల్ బంక్ ఎదురుగా వాహనాలు



తనిఖీ చేసి పాత ఛానల్లు ఉన్నవాటిని కట్టించారు. హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలని, వాహన దారులకు ట్రాపిక్ నిబంధనలను ఎస్.ఐ. అర్జున్ వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ అర్జున్ తెలిపారు..

# సామూహిక ఎలుకల నివారణ ద్వారా పంటల్ని కాపాడుకోవచ్చు

## – డిఏవో ఎం.డి.ఎఫ్. విజయ కుమారి

● కవులూరులో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన




**జి.కొండూరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** సామూహిక ఎలుకల నివారణ ద్వారా పంటల్ని కాపాడుకోవచ్చు అని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.డి.ఎఫ్. విజయ కుమారి అన్నారు.ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం,కవులూరు గ్రామం లోని రైతు సేవా కేంద్రం ఆవరణలో మండల వ్యవసాయ అధికారి కె.సిహెచ్.సూరిబాబు ఆధ్వర్యంలో గురువారం సామూహిక ఎలుకల నివారణ పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు హాజరైన డి ఏ వో విజయ కుమారి, గుంటూరు వ్యసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారద,ఏ డి ఎ అనిత భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా డి ఏ వో మాట్లాడుతూ ఆహార ధాన్యాల ఉత్పత్తి మరియు నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలు అని, ఎలుకలు వరి పంటను అన్ని దశలలో దెబ్బతీస్తాయని, వరి పంటలను కాపాడుకోవడానికి సామూహిక ఎలుకల నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. ఎలుకలను సమర్థవంతంగా నివారించుటకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలన్నా రు.ఎలుకలు నారుమళ్ళ లో విత్తనాలను తిని వేయడం, మొలకలను కత్తిరించడం లేదా పీకి వేయడం వంటివి చేస్తాయన్నారు.విత్తినది మొదలు కోత వరకు ఎలుకలు వరి పంటపై దాడి చేసి నష్టం కలిగిస్తాయన్నారు. నాటిన పంటలో పిలకలను, పండిన పంటలో కంకులను నాశనం చేస్తాయని పేర్కొన్నారు.బ్రొమోడయాలోన్ ఎలుకల మందును ఉపయో గించి సామూహిక ఎలుకల నివారణ చేయవచ్చని తెలియజేశారు. ఈ మందు ను 100 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.డిడిఎ శారద సామూహిక ఎలుకల నివారణ మందు తయారీ విధానంలో 100 గ్రాముల తయారీకి 96 గ్రాముల నూకలు 2 గ్రాముల బ్రొమోడయాలోన్ మందు 2 గ్రాములు నూనె కలిపి తయారీ విధానం చేసి చూపించారు.ప్రతీ ఎలుక కన్నానికి 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పెట్టాలని తెలిపారు.ఈ మందును 100 శాతం రాయితీతో మండలంలో ని అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రతి రైతుకు అందజేసినట్లు వ్యవసాయ అధికారి సూరిబాబు తెలిపారు.ఎలుకలు కలగజేసే నష్టం తీరుతెన్నుల ను అవగాహన చేసుకుని తదనుగుణంగా సమగ్ర యాజమాన్య చర్యలను చేపట్టాలన్నారు. అనంతరం రైతులతో కలిసి గ్రామ శివారు లో ఉన్న వరి పంటలను సందర్శించి పొలంలో ఎలుకల బొరియలలో మందు ను ఎలా పెట్టాలో అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు చూపించారు.ఈసదస్సు లో గ్రామ వ్యవసాయ సహాయకులు,రైతులు పాల్గన్నారు.

# సబ్సిడీ ఋణాల మంజూరు నిలుపుదల తగదు



**తోట్లవల్లూరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** 2024-2025 ఆర్థిక సంవత్సరానికి బీసి లకు, ఇబిసి లకు, కాపులకు మంజూరు చేయాల్సిన 50% రాయితీ ఋణాలకి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని కృష్ణాజిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. రాజేంద్ర బాబు లిఖిత పూర్వకంగా తెలియజేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ గురువారం తెలియజేశారు. ఈ విషయమై ఇటీవల పబ్లిక్ గ్రీవెన్స్ సెల్లో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి చేసిన ఫిర్యాదు మేరకు, బిసి కార్పొరేషన్ కార్యాలయ అధికారి సమ్మెట. నాగ వెంకటప్రసాద్ ఉయ్యూరు లో విచారణ జరిపిన అనంతరం, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఋణాల మంజూరును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన విషయాన్ని ఈరోజు లిఖిత పూర్వకంగా లేఖ ద్వారా తెలియచేసారని అన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత బిసి కార్పొరేషన్ ద్వారా రాష్ట్రము లో బిసి, ఇబిసి, కాపుల రుణాల మంజూరు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది వందల తొంబై ఆరు కోట్ల డెబ్బై తొమ్మిది లక్షల రూపాయలు ను, ఉమ్మడి కృష్ణాజిల్లా కు 117,65 కోట్లు కేటాయించటం జరిగిందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాలలో, ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారన్నారు.లిరుణాల మంజూరును యధాతథంగా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కోస్తా జిల్లాల కన్వీనర్ బేతపూడి జోగేశ్వరరావు, కృష్ణాజిల్లా కన్వీనర్ బయవరపు దుర్గాప్రసాద్, తోట్లవల్లూరు మండల కన్వీనర్ మరీదు. సాంబశివరావు, ఉయ్యూరు మండల కన్వీనర్. బొల్లా శివ పార్వతి పాల్గొన్నారు.

# అమలాపురంలో కలకలం రేపిన యువకుడి కిడ్నాప్

● చెన్నైలో యువకుడిని వదిలి వెళ్ళిన కిడ్నాపర్స్

**అమలాపురం,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్ర అమలాపురంలో ఓ యువకుడి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే అమలాపురం రూరల్ ఇందుపల్లి గ్రామానికి చెందిన పామర్తి వీర రాఘవ పెద్ద కుమారుడు పామర్తి మణికంఠ గంగరాజు అమలాపురం కాలేజ్ రోడ్డు నందు గల ఆదిత్య జూనియర్ కాలేజ్ లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అయితే సోమవారం ఉదయం కాలేజీకి వెళ్లిన మణికంఠ గంగరాజు రాత్రి 8గంటలకు తిరిగి రావాల్సి ఉండగా అతను ఇంటికి చేరుకోకపోవడంతో అతని తండ్రి మణికంఠ స్నేహితులను ఫోన్ ద్వారా ఆరాతీశారు మణికంఠ ఆరోజు కళాశాలకు రాలేదని వారు చెప్పడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతడి కోసం గాలిస్తుండగా మణికంఠ నుండి వారికి ఫోన్ వచ్చింది తాను చెన్నై రైల్వే స్టేషన్ లో ఉన్నానని తనను అక్కడకు ఎవరు తీసుకువెళ్ళారో తెలిదని అతడు చెప్పడంతో మణికంఠ తండ్రి వీర రాఘవ అతడికి ధైర్యం చెప్పి స్టేషన్ వద్ద ఉండే రైల్వే పోలీసు వద్దకు వెళ్లి వారికి విషయం చెప్పి అక్కడే ఉండమని చెప్పాడు. తదుపరి వీర రాఘవ చెన్నైలో తనకు తెలిసిన స్నేహితులకు విషయం చెప్పడంతో వారు హుటా హుటిన మణికంఠ వద్దకు చేరుకొని మణికంఠ ను వారి నివాసం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం అమలాపురం చేరుకున్న మణికంఠను జరిగిన ఘటనపై ఆరా తీయగా తాను ప్రతిరోజూ కళాశాలకు వచ్చే దారిలో కొంత మంది ఆగంతకులు తనను అడ్డగించి బలవంతంగా మత్తు మందు ఇచ్చి అమలాపురం బస్టేషన్ వరకూ నడిపించుకుని తీసుకుని వెళ్లారని ఆతరువాత ఏమిజరిగిందో తనకు తెలియదని తనకు మెలుకువ వచ్చే సరికి చెన్నై రైల్వే స్టేషన్ లో ఉన్నానని మణికంఠ చెప్పాడు.రైలులో అవ్యక్తులు తనకు టాబ్లెట్స్ వేశారని తనకు వాంతులు కావడంతో నీతో ఇంక మాకు పనిలేదు నిన్ను వదిలేస్తున్నాము ఆంధ్రాకు వెళ్ళిపో ఇక్కడ ఎవరితోనూ ఏమి మాట్లాడొద్దు అని వారు తనతో అన్నారని మణికంఠ చెప్పాడు.

# ఆర్జీయూకేటీ నూజివీడులో 'ప్రజ్ఞ' మాసపత్రిక ఆవిష్కరణ



**నూజివీడు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఆర్జీ యూకేటీ నూజివీడు 'ప్రజ్ఞ' పేరుతో మాసపత్రికను ప్రారంభించింది. 'ప్రజ్ఞ' మాసపత్రిక తొలి సంచికను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ మరియు నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ ఆవిష్కరించారు. 'ప్రజ్ఞ' మాసపత్రికగా ప్రతి నెలా ప్రచురించబడుతూ, నూజివీడు ఆర్జీయూకేటీ విద్యార్థుల చైతన్యాన్ని, ప్రతిభను, నూతన ఆవిష్కరణలను ప్రచురించనుంది. అనేక అంశాల సమాహారంగా, విద్యార్థుల ప్రతిభకు పెద్దపీట వేస్తూనే అధ్యాపకులకు సంబంధించిన విద్యాసంబంధిత అంశాలను కూడా ప్రతిబింబిస్తుంది. 'ఐఐటీలలో ఇలాంటి మాసపత్రికలు ప్రచురితమవుతాయని, అలాంటి సంప్రదాయాన్ని ఐఐఐటీలకు కూడా పరిచయం చేయడం సంతోషం. ఇంజనీరింగ్ విద్యార్థులే తమ పరిజ్ఞానంతో ఈ మాసపత్రికక అంకురార్పణ చేసుకోవడం ఆనందమని, వారు ఎంపిక చేసిన పేర్లలో 'ప్రజ్ఞ ' అనే పేరును పాలనాధికారి డా. లక్ష్మణరావుతో కలిసి నిర్ణయించడం జరిగిందని ' ఆచార్య అమరేంద్ర కుమాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముద్రిత పత్రికతో పాటు, ఒక ప్రత్యేక వెబ్సైట్ కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ మొత్తాన్ని డీ.ఎస్.డబ్ల్యూ డా. రాజేష్, డా. దుర్గాభవాని ఆధ్వర్యంలో ఇంగ్లీష్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ దివ్యశ్రీ మారేపల్లి నిర్వహణా బాధ్యతలు చూశారు. ఇంజనీరింగ్ చదివే వివేక్, ఇందు, కీర్తి, వినయ్, ప్రసూన, చంద్రశేఖర్, స్టీఫెన్ అనే విద్యార్థులు సంపాదకమండలి సభ్యులుగా వ్యవహరించనున్నారు. 'ప్రజ్ఞ' మాసపత్రికలో సాంకేతిక విద్యార్థులకు ఉపకరించే వాసాలతో పాటు వారిలోని ప్రజ్ఞను వెలికితీసే కొన్ని కవితలు కూడా ప్రచురించబడ్డాయి. ఆర్జీయూకేటీ నూజివీడులో చదివి మంచి స్థాయిలో ఉన్న విద్యార్థుల పరిచయాలతో పాటు అధ్యాపకుల ప్రతిభకు కారణమైన అంశాలను కూడా పొందుపర్చారు. విజయవంతమైన ప్రారంభానికి డైరెక్టర్, పరిపాలన, అధ్యాపకులు మరియు విద్యార్థుల మద్దతు ప్రధాన కారణమైంది. రాబోయే సంచికలకు కూడా ఇదే ఉత్సాహం కొనసాగుతుందని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ పరిపాలనాధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు. డైరెక్టర్ ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో ఇంకా సెంట్రల్ డీన్ శ్రావణి, ఈఐటీపీ డీన్ శ్యాం, పాలనాధికారి డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. సాదు చిరంజీవి, ఫైనాన్స్ అధికారులు డా. నాగార్జునాదేవి, డా.శ్రీనాథ్, డా. పావని, మైథిలి, డీ.ఎస్.డబ్ల్యూలు డా. రాజేష్, డా. దుర్గాభవాని, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాణాసంచా తయారీ కేంద్రాలపై తనిఖీలు

## -నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ, ఎస్ఐ జ్యోతిబసు, రెవిన్యూ, అగ్ని మాపక అధికారుల తనిఖీలు



**నూజివీడు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, నూజివీడు డిఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ పోలీస్ సిబ్బందితో కలిసి నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో బాణాసంచా తయారీ మరియు నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అక్రమంగా బాణాసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని, అందువల్ల ఇలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాణాసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు అధికారుల అనుమతు లతో మాత్రమే నడపాలన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే Explosives Act ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 112 కు లేదా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. బాణసంచా తయారీ కేంద్రాల వద్ద సదర్ కేంద్రాల యొక్క యజమానులు ఇసుక ను నీటిని అందుబాటులో ఉంచాలని ఎటువంటి ప్రమాదాలు సంభవించిన ఎదుర్కోవడానికి కావలసినటువంటి చర్యలను తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాల లోపు మైనర్ యొక్క బాల,బాలికలను తయారీ కేంద్రాల వద్ద లేదా విక్రయాల వద్ద వినియోగించరాదని దానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించన యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరికలు జారీ చేసినారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే జరగకుండా తగిన చర్యలు తీసుకొనడం చాలా శ్రేయస్కరమని ప్రజల యొక్క ప్రాణ నష్టం గానీ ఆస్తి నష్టం కాని జరగకుండా ప్రభుత్వం వారి యొక్క అనుమతులు పొందిన వారి మాత్రమే బాణసంచా నిలువలు గాని తయారీ గాని చేయాలని సూచించారు. బాణాసంచా తయారీలో అజాగ్రత్త వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని, చిన్న పొరపాటు కూడా ప్రాణ నష్టం కలిగించవచ్చునీ, కాబట్టి ఎవరూ చట్ట విరుద్ధంగా బాణాసంచా తయారీ లేదా నిల్వలు చేయరాదు. పిల్లలు, యువతులు సురక్షితంగా దీపావళి జరుపుకోవాలన్నారు. నూజివీడు రూరల్ పోలీస్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు ఈ తనిఖీలను కొనసాగిస్తూ, ప్రజల భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని తెలియ చేసినారు.

# రైతులకు ప్రయోజనకరంగా గుడివాడలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఏర్పాటు..

## -రైతాంగ సమస్యలపై.. ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే రాము..



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణ అంచనాలను ఇప్పటికే ఏపీ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు పంపినట్లు ఆయన చెప్పారు. స్థానిక రాజేందర్ నగర్ లోని తన స్వగృహంలో ఇరిగేషన్ మరియు డ్రైనేజీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా కాలువలు, డ్రైన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. డిసెంబర్ లోపు ఎమర్జెన్సీ వర్కులను పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే రాము సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా వడ్లమన్నాడు, కొమరవోలు గ్రామాల్లోని మేజర్ చానల్స్ మరియు బుడమేరులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రణాళికల రూపొందించామన్నారు. ఇప్పటికే అంచనాలను ఏపీ స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ లీలా కృష్ణకు అందించామన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ లీలా కృష్ణ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు విషయమై సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. నియోజకవర్గంలోని కాలువలపై జరుగుతున్న అత్యాసర పనులు నిర్ణీత కాలంలో పూర్తిచేసేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. ముఖ్యంగా బలహీనంగా ఉన్నచోట్ల కాలువల గట్లను పటిష్టం చేయడం, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజీ డీఈఈలు నాగేంద్ర కుమార్, శ్రీను ఇరిగేషన్ డీఈఈ భరత్, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖల ఏఈలు అనీల్, కుమార్, అరుణ్, లక్ష్మీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నోర్ చేయవద్దు.. మరొక్కసారి గుర్తు చేసుకోండి..!



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ సహకారం తో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఇగ్నోర్ చేయవద్దు మరొక్కసారి గుర్తు చేసుకోండి.. ? అని గ్రామాలలో ఐఇసి ఎల్ఈడి టివి మొబైల్ వ్యాన్ ద్వారా హెచ్ఐవి / ఎయిడ్స్ మరియు సుఖవ్యాధులు పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముందుగా గుడివాడ ఏరియా హాస్పిటల్ నందు డా॥ జయప్రద మరియు హాస్పిటల్ చైర్మన్ జోన్స్ లు పచ్చ జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించడం జరిగింది. తర్వాత ప్రచార రథం ద్వారా గుడివాడ, పెదపారుపూడి, కలవపాముల, వెంకట్రాగడ, ముదునూరు గ్రామాలలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీబీ సూపర్వైజర్ ఆరోగ్యం, ఐసిటిసి స్టాఫ్, ఆర్ట్ స్టాఫ్, ఎస్టిఐ స్టాఫ్ మరియు ఎల్డబ్ల్యుఎస్ సూపర్వైజర్ బి రాకేష్, క్లస్టర్ లింక్ వర్కర్స్ పి. దేవి, కె. వినయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ మిత్రుల అధ్వర్యంలో 'కిలారపు'కు సత్కారం..



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు కిలారు రంగప్రసాద్ కి.. వారి సేవలను గుర్తించి వారికి పలు వాకర్స్ క్లబ్ల నేతలు సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు హాజరైన ప్రముఖులు తారకరామా వాకర్స్ క్లబ్ గుడివాడ వ్యవస్థాపకులు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దండమూరి సీతారామ స్వామి అలాగే తెలుగు మహిళ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు యార్లగడ్డ సుధారాణి, గుడివాడ మహిళా వాకర్ అధ్యక్షురాలు దీవెన, తారకరామా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య, పి నాంచారయ్య, తమ్మినేని రామ్మోహన్ రావు, దిమ్మిట శ్రీనివాసరావు, రమాదేవి, చల్లారేశ్వరి, బి ఆండాలు, వీరమాచినేని శైలజ, ప్రతిభ, అల్లు కళ్యాణ్, బి రాధాకృష్ణ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై కిలారు రంగ ప్రసాద్ ని ఆయన సేవలను కొనియాడుతూ పలువురు ప్రసంగించినారు.. తదనంతరం పూలమాలతో శాలువలతో ఘనంగా సత్కరించినారు.

# ఆటోనగర్ కార్మికుడికి ఆర్థిక సాయం..



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** వేముల వంశీ బ్యాంకు కాలనీలో నివాసముంటు ఆటోనగర్లో డ్రిల్లింగ్ వర్కర్ గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కుడికాలు వ్రేళ్ళు విరిగినవి. ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ (శ్రామిక హక్కుల పోరాట సంఘం) ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆ కార్మికున్ని గురువారం రోజున పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు టి. లక్ష్మణరావు అధ్యక్షులు అబ్దుల్ హమీద్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్ ఉపాధ్యక్షులు బొబ్బరపల్లి ఆంజనేయులు నాయకులు షేక్ జీ మొహిద్దీన్ భాష రాజబోయిన వీర్రాజు కల్వకుంట నాగరాజు ఎండి రషీద్ బేగ్ మదిరి శ్యామ్ కుమార్ అన్నమనేడి వెంకటరమణ లు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● గుడివాడలో 1087 కేజీల బియ్యం స్వాధీనం, ఒకరిపై కేసు నమోదు..



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు, గుడివాడ డిఎస్పీ వి. ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో గుడివాడలో పిడిఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించారు. గుడివాడ వన్టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ మరియు ఎస్సై పామర్తి గౌతమ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గుడివాడ వన్టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్మిక నగర్లో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా పై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం (09.10.2025) దాడులు నిర్వహించారు. ఈ రైడ్లో, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 22 బస్తాలు అవి సుమారుగా 1087 కిలోల పిడిఎస్ బియ్యాన్ని మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగింది.

# 10 నుండి 3రోజుల పాటు ధ్యాన మహా యజ్ఞం..

## –రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం



**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఈ నెల 10, 11, 12 తేదీలలో నిర్వహించే ధ్యాన మహా యజ్ఞం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం నిర్వాహకురాలు రాజకుమారి తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్ లోని కార్యాలయంలో రాజకుమారి విలేకర్లుతో మాట్లాడుతూ గుడివాడ పరిసర ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని నిర్వహించే సామూహిక యజ్ఞంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వాణి, డా॥ మలిరెడ్డి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన.. క్రిష్ణ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాలు మేరకు, గుడివాడ సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ వి. ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో గుడివాడ 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కొండపల్లి శ్రీనివాస్ గుడివాడ 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిది లో మంగళవారం ఆర్.కె. డిగ్రీ కాలేజి నందు విద్యార్ధులకు సైబర్ నేరాలపై అలాగే వాటి వలన కలిగే పర్యావసనాలు పై అవగాహన కల్పించారు.
–గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :

# సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలి -పి. రాజేష్

● గుడివాడ వీ.కే.ఆర్ అండ్ వీ.ఎన్.బి ఇంజినీరింగ్ కళాశాలలో "స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మరియు మెషిన్ లెర్నింగ్" పై మూడు రోజుల పాటు జాతీయ స్థాయి కార్యశాల




**గుడివాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** సాంకేతికతల పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలని, వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్‌లు అన్వయిస్తాయని అక్యూరైజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. రాజేష్ అన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్బీ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్‌పై మూడు రోజుల జాతీయ స్థాయి కార్యశాలను ప్రారంభించారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేష్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్, డేటా విశ్లేషణ, ప్రిడిక్షన్ మోడల్స్‌ను వాస్తవ అనువర్తనాలను అన్వయించే నైపుణ్యాన్ని పొందుతారన్నారు. పరిశ్రమల్లో ఉపయోగించే స్మార్ట్ మానిటరింగ్, ఆటోమేషన్, నిర్ణయాల ప్రక్రియలను అర్థం చేసుకుంటారన్నారు. కార్యశాల ప్రారంభోత్సవ సభలో కళాశాల సెక్రటరి కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి. కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి. ప్రసాదరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎమ్.నాగు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డా. జి. మురళి కృష్ణ, కార్యక్రమ సమన్వయకర్త పి. నవీన్ త్రినాథ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం




**కాకినాడ,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికిన వారిలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టరు షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు,కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి,పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ ఉన్నారు.అక్కడ నుంచి కాకినాడ కలెక్టరేట్ లో ఉప్పాడ మత్స్యకార సోదరుల కార్యక్రమం మాట-మంతిలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# ఆహార ధాన్యాల ఉత్పత్తి, నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలు - ఏడిఏ యం.శ్రీనివాసరావు

● వెల్వడంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన సదస్సు




**మైలవరం,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఆహార ధాన్యాల ఉత్పత్తి మరియు నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలు అని, ఎలుకలు వరి పంటను అన్ని దశలలో దెబ్బతీస్తాయని, వరి పంటలను కాపాడుకోవడానికి సామూహిక ఎలుకల నివారణ ఒక్కటే మార్గమని మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు అన్నారు.మండలంలోని వెల్వడం గ్రామం రైతుసేవాకేంద్రంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు లో ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తినది మొదలుకొని కోత వరకు ఎలుకలు వరి పంటపై దాడిచేసి నష్టం కలిగిస్తాయనీ,చురుకైన పిలకదశ లో ఎలుకల వల్ల 0.5 శాతం నుంచి 60 శాతం వరకు అలాగే పంట కోత దశలో 5 నుంచి 10 శాతం నష్టం ఉంటుందని తెలిపారు.ఈ ఎలుకల నివారణకు రైతులందరు సామూహికంగా ఒకేసారి నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని రైతులకు సూచించారు.ఎలుకల నివారణకు రాష్ట్రప్రభుత్వం 100 శాతం రాయితీపై బ్రోమోడయాలోన్ ఎలుకల మందును సరఫరాచేస్తుందని తెలియజేశారు. వ్యవసాయ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ మైలవరం మండలపరిధి లోని అన్ని రైతు సేవా కేంద్రాలలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమము నిర్వహించటం జరిగిందని తెలిపారు. సామూహిక ఎలుకల నివారణ మందు తయారీ విధానం రైతులకు చేసి చూపించారు.ఒక బొరియకు 10 గ్రాముల విషపు ఎర పొట్లాన్ని పెట్టాలని, 100 గ్రాముల విషపు ఎర తయారికి 2 గ్రాముల బ్రోమోడయాలోన్ మందు, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె అవసరం ఉందని ఏవో తెలిపారు.అనంతరం రైతులతో కలిసి గ్రామ శివారు లో ఉన్న వరి పంటలను సందర్శించి పొలంలో ఎలుకల బొరియలలో మందు ను ఎలా పెట్టాలో అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు చూపించారు.ఈ కార్యక్రమం లో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, మైలవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య,చంద్రగూడెం సొసైటీ చైర్మన్ ఎం వి రోశాలు,మైలవరం సొసైటీ చైర్మన్ కరెడ్ల వెంకటనారాయణ,విఏఏ లు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవుని దేవస్థాన జీర్ణోద్ధరణకు విరాళాల వెల్లువ...



**గుడ్లవల్లేరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ పనులకు గురువారం పలువురు దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. ఆలయాభివృద్ధికి శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ రూ.50 వేలు, శాఖమూరి శ్రీనివాసరావు, శివశ్రీ దంపతులు రూ.10,116, విజయవాడ వాస్తవ్యులు మద్దుకూరి ధనలక్ష్మి రూ.10,116, వినుకొండ వాస్తవ్యులు అల్లా ఆంజనేయులు, అనురూప దంపతులు రూ.10,116, లంకసాని నరసింహమూర్తి, మీనాక్షి దంపతులు రూ.10,116, కాకినాడ వాస్తవ్యులు మద్దిపట్ల సుధాకర్, పద్మ దంపతులు రూ.10,116, గోళ్ళ బ్రహ్మాజీ, విజయశ్రీ దంపతులు రూ.10,116, గద్దె సత్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు రూ.10,116, చల్లపల్లి వాస్తవ్యులు కావూరి సుబ్బారావు, దుర్గాభవాని దంపతులు రూ.10,116, గుంటూరు వాస్తవ్యులు ఉనం జగ్గయ్య, అనసూయమ్మ దంపతులు, నన్నపనేని రవీంద్రనాథ్, మనీషా దంపతులు రూ.10,116 విరాళాల్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు, చాపరాల రామారావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ నాయకుల ఆధ్వర్యంలో ఆశాజ్యోతి లో అన్న ప్రసాద వితరణ




**హనుమాన్ జంక్షన్, అక్టోబరు 9 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ ప్రసిడెంట్ పంచకర్ల చక్రవర్తి పి ఎం జె ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి దివ్యాంగుల హెూమ్ లో అన్న దాన వితరణ ఏర్పాటు చేశారు. లయన్ కొండపనేని రవీంద్ర కుమార్ తండ్రి కొండపనేని కృష్ణమూర్తి పుట్టిన రోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. తమ లయన్స్ క్లబ్ లో ఎవరి పుట్టిన రోజు చేసుకోవాలన్నా పార్టీలకు తావివ్వకుండా అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలానే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు లయన్ చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ మాకినేని శ్రీనివాసరావు, ట్రజరర్ అక్కినేని రాఘవేంద్రరావు, లయన్ కొండపనేని రవీంద్రనాథ్, లయన్ నందిగం స్వామి, లయన్ అక్కినేని ఫణీంద్ర, ఆశాజ్యోతి నిర్వాహకులు మరీదు మాధవీ లత తదితరులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు విడుదల

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీ రాజ్ సంస్థలకు కేంద్రం రూ.410 కోట్లకు పైగా నిధులు

**విజయవాడ(పి.ఐ బి),అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15 వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులలో తొలి విడత అన్‌టైడ్ గ్రాంట్ రూ.410.76 కోట్లను రాష్ట్రానికి విడుదల చేశారు. ఈ నిధులు రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లా పరిషత్తులు, 650 మండల పరిషత్తులు మరియు 13,327 గ్రామ పంచాయతీలలో 13,092 అర్హత కలిగిన గ్రామ పంచాయతీలకు లబ్ధి. అన్‌టైడ్ గ్రాంట్‌లు గ్రామీణ స్థానిక సంస్థలు లేదా పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చు. ఈ నిధులను జీతాలు లేదా ఇతర పరిపాలనా వ్యయాల కోసం వినియోగించరాదు. భారత రాజ్యాంగంలోని పదకొండవ షెడ్యూల్ లో పేర్కొన్న 29 అంశాల పరిధిలో ఉండే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కోసం మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. “టైడ్ గ్రాంట్‌లను (ఏ) పరిశుభ్రత, బహిరంగ మల విసర్జన రహిత స్థితి నిర్వహణతో పాటు గృహ వ్యర్థాల నిర్వహణ, మానవ విసర్జితాలు, ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్ కూడా ఉపయోగించవచ్చు. (బి) తాగునీటి సరఫరా, వర్షపు నీరు నిల్వ, నిర్వహణ, నీటి పునర్వినియోగం కొరకు వినియోగించవచ్చు.

# మరికొన్ని పిఏసిఎస్ లకు త్రిసభ్య కమిటీల నియామకం






**పెడన,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం లోని మరికొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించినట్లు సమాచారం. చైర్మన్ తో పాటు ఇద్దరు సభ్యులను కూడా ఈ కమిటీలో ప్రభుత్వం నియమించింది. పెడన మండలం చెన్నూరు కమలాపురం చేవేంద్ర గూడూరు మండలం గూడూరు మల్లవోలు లేళ్ళగరువు కృత్తివెన్నుమండలం కొమాళ్లపూడి చైర్మెన్లను నియమించారు. అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో ప్రకటన వెలు వడనుంది. చెన్నూరుకు యర్రంశెట్టి దేవేంద్ర ప్రసాద్ కమలాపురం కు కొట్టే సురేష్ బాబు చేవెంద్ర కు అంకెం పమిడేశ్వరావు గూడూరు కు తలుపుల వెంకట కృష్ణారావు మల్లవోలుకు ముద్దినేని వెంకటేశ్వరావు ( కొండా )లేళ్లగ రువు కు గుడివాడ వెంకటరావు కొమాళ్ల పూడి కి కూనసాని నాగబాబు నియమితులయ్యారు.

# డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దందా...!

● సబ్సిడీ గ్యాస్ పక్కదారి....వ్యాపార అవసరాల కు 'డొమెస్టిక్' సిలెండర్లు ● కంచే చేను మేసిన చందం'గా మారిన సబ్సిడీ గ్యాస్ ఏజెన్సీల వ్యవహార శైలి ● విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయట పడుతున్న 'డొమెస్టిక్' గ్యాస్ సిలిండర్ల దందా ● పౌర సరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ తూచ్.... ● పట్టించుకోని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు

'కంచే చేను మేసిన చందం'గా ఏజెన్సీలే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీనిని ఆదిలోనే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది గ్యాస్ వినియోగదారులపై మరింత ప్రభావం పడే ప్రమాదం లేకపోలేదు.డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా నిరంతరంగా తనిఖీలు చేయాల్సిన సివిల్ సప్లయ్,ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇటీవల కాలంలో తనిఖీలు చేయడం మానేశారు.ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు.





**మైలవరం/జి.కొండూరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాలో 'డెమెస్టిక్' గ్యాస్ సిలిండర్ల దందా కమర్షియల్ అయిపోయింది. గృహావసరాలకు వినియోగించే (డొమెస్టిక్) సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి.ఈ వ్యాపారం ప్రధానం గా జిల్లా లో పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాకూ పాకింది.నిబంధనలకు విరుద్ధంగా హెూటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,దాబాలు,చికెన్ షాపులు, టిఫిన్ సెంటర్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ లకు బదులుగా గృహవసరాలకు వినియోగించాల్సిన 14.5కిలోల గ్యాస్ సిలిండర్ల ను దొంగచాటున వినియోగిస్తున్నారు.తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోండగా కొంత మంది గ్యాస్ ఏజెన్సీదారులకు తెరచాటున ఇదొక వ్యాపారంగా మారిపోయింది.అయితే హెూటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఇతర వ్యాపారా లకు కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వ నిబంధనలున్నాయి. అయితే చాలావరకు ఆ నిబంధనలను వ్యాపారస్తులు ఎవరూ పాటించడం లేదు. ఎందుకంటే 19 కిలోలు గల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ప్రసుతం రూ.1750 లు.అదే గృహావసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 14.5 కిలోలు ఉండి దాని విలువ రూ.880 లు ఉంది.ఈ లెక్కన కమర్షియల్ సిలిండర్ కు వెచ్చించే డబ్బులతో రెండు డొమెస్టిక్ సిలిండర్లు కొనుగోలు చేయవచ్చు. గ్యాస్ కూడా ఎక్కువగా వస్తుంది.దీంతో హెూటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, దాబాలు నిర్వాహకుల కు ఇది తప్పని తెలిసినా డొమెస్టిక్ గ్యాస్ వినియోగించడానికి వక్రమార్గాన్ని ఆచరిస్తున్నారు.గ్యాస్ ఏజెన్సీలను మచ్చిక చేసుకుని డొమెస్టిక్ సిలిండర్లను సబ్సిడీ లేకుండా కొనుగోలు చేస్తున్నారు.ఇటు గ్యాస్ ఏజెన్సీలకు కూడా ఒక్కో సిలిండర్ పై రూ.200 వరకు లాభం రావడంతో 'డొమెస్టిక్' దందా 'మూడు పువ్వులు, ఆరు కాయలు'గా మారింది.

**జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు వివరాలు...:** జిల్లాలో డొమెస్టిక్ గ్యాస్ సింగిల్ కనెక్షన్లు 5,03,021,డబుల్ కనెక్షన్లు 5,41,129, దీపం కనెక్షన్లు 2,32,580, ఉజ్వల కనెక్షన్లు 46,353,అలాగే కమర్షియల్ కనెక్షన్లు 10,626 ఉన్నాయి.ఈ సిలిండర్లను సరఫరా చేసేందుకు ఇండియన్, హెచ్ పి, భారత్ కలిపి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు 54 వరకు ఉన్నాయి.జిల్లా అంతటా హెూటళ్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, రెస్టారెంట్ లు, టిఫిన్ సెంటర్లు,ఇతరవ్యాపారాలు వేల సంఖ్యలో ఉన్నాయి.ఈ నేపథ్యంలో కమర్షియల్ సిలిండర్లు హెూటళ్ల సామర్థ్యం ఆధారంగా వారం ఒకటి నుంచి రెండు, మరి కొన్నింటిలో నెలకు ఐదు వరకు వినియోగం అవుతున్నాయి.అయితే వ్యాపారం అంతా ఒక కమర్షియల్ సిలిండర్ పై వెళ్లదీయడం సాధ్యం కాని పని.దీంతో డొమెస్టిక్ సిలిండర్లను అక్రమం గా వినియోగిస్తున్నారు.కార్లు, ఇతర వాహనాల్లో కూడా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు నుంచే ఎక్కిస్తున్నారు.ఇలా జిల్లా వ్యాప్తంగా గృహావసరాలకు వినియోగించే సిలిండర్లు పక్కదారి పడుతున్నా అధికారులు మాత్రం 'మామూలు'గానే తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**జి.కొండూరులో విజిలెన్స్ తనిఖీ:** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల కేంద్రంలో 30వ జాతీయ రహదారి బైపాస్ పక్కన దర్బార్ రెస్టారెంట్ లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు.కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడుతున్నట్లు తనిఖీల్లో బయటపడటంతో వెంటనే రెస్టారెంట్ లో ఉన్న 10 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని రెస్టారెంట్ నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని సమంత శాఖ అధికారులకు సూచించినట్లు తెలిసింది.ఇలా జాతీయ రహదారుల పక్కన ఉన్న హెూటళ్ళు, రెస్టారెంట్లలో నిత్యం డొమెస్టిక్ సిలిండర్ లను వినియోగిస్తున్నారని,వాటిపై కూడా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

**గ్రామాల్లో జోరుగా డొమెస్టిక్ సిలిండర్ల వ్యాపారం:** మరోవైపు మైలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో డొమెస్టిక్ సిలిండర్ల వ్యాపారం జోరుగా సాగుతోంది.కొంతమంది గ్యాస్ ఏజెన్సీల వారికి కమిషన్లు ముట్టచెప్పి పెద్ద మొత్తంలో సబ్సిడీ ధరకే డొమెస్టిక్ సిలిండర్లు కొనుగోలు చేసి వాటిని డిమాండ్ ను బట్టి హెూటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లకు ,చికెన్ షాపులు, టిఫిన్ సెంటర్ల కు అదనంగా రూ. 200లకు పైగా నుంచి విక్రాయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**పౌర సరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ తూచ్....:** ఏజెన్సీల్లో గ్యాస్ పక్కదారి పడుతున్నా పౌర సరఫరాల శాఖ, రెవిన్యూ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై గ్యాస్ వినియోగదారు లు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏ హెూటల్లో చూసినా పేదోడి సిలిండర్లే.జిల్లా వ్యాప్తంగా పెద్ద మాఫియా జరుగుతున్నా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారుల యంత్రాంగం నిమ్మకు నిమ్మకు నిరీతినట్లుగా వ్యవహరించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏదో గుర్తొచ్చినప్పుడు సివిల్ సప్లై, విజిలెన్స్, అధికారులు హడావుడి చేసి చిరు వ్యాపారస్తులు, చిన్న చిన్న హెూటళ్ల పై దాడులు చేసి వాళ్ల టార్గెట్ పూర్తి చేసుకుంటారని గ్యాస్ వినియోగదారులు విమర్శిస్తున్నారు.

# వై.సి.పి. డైరెక్షన్తోనే అంబేద్కర్ విగ్రహం ధ్వంసానికి కుట్ర

● గన్నవరం నియోజకవర్గ బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ కమిటీ

● హనుమాన్ జంక్షన్ లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించిన టి.డి.పి. శ్రేణులు




**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా కుట్రలకు పాల్పడిన వై.సి.పి. పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని గన్నవరం నియోజక వర్గ బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ జిల్లా, రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అనుచరుడు వై.సి.పి. సర్పంచ్ గోవిందయ్య నిప్పుపెట్టి దానిని తెలుగుదేశం నేతలపైకి నెట్టాలని చేసిన కుట్రకు నిరసనగా ఈరోజు ఉదయం కృష్ణాజిల్లా, బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్జంక్షన్లోని బాపులపాడు మండల పరిషత్ ఆవరణలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలదండలు వేసి వై.సి.పి. దళిత వ్యతిరేకపార్టీ అంటూ నినాదాలు చేసి అంబేద్కర్కు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర టి.డి.పి. నేతలు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి సాయికళ్యాణి తదితరులు మాట్లాడుతూ 2019-2024 లో వై.సి.పి. ప్రభుత్వ హయాంలో 56వేల మంది దళితులపై దాడులు, 192 మందిని హత్య చేశారని స్వయంగా రాజ్యసభలో కేంద్రం వెల్లడించిందని, జగన్ రెడ్డి పాలనంతా దళితులపై దాడులు, విధ్వంసాలే జరిగాయని, కూటమి ప్రభుత్వంలో ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవనం సాగిస్తుంటే అశాంతిని రేకెత్తించే విధంగా జగన్ కుట్రలు లేపుతున్నారని అన్నారు. విగ్రహం ధ్వంసం కేసులో వై.సి.పి. సర్పంచ్ గోవిందయ్య, ఇతరులు స్వయంగా పట్టుబడి జైలుకు వెళ్ళినా జగన్రెడ్డి మౌనంగా ఉండటం దేనికి సంకేతమని అన్నారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో కుట్రదారులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో టి.డి.పి. నాయకులు వేగిరెడ్డి పాపారావు, పుట్టా సురేష్, కొమ్మారెడ్డి రాజేష్, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, మందాడి రవీంద్ర, కాటూరు విజయభాస్కర్, మొవ్వా వేణుగోపాల్, లంకా అజయ్, అచ్చెన వెంకటేశ్వరరావు, కర్రా ప్రసాద్పాల్, కొండపల్లి వెంకన్న, లింగానేని శ్రీధర్, సరిపల్లి కాంతారావు, సాయల నాగేశ్వరరావు, తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, దోనె రాము, మాతంగి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అపరమత్తత అవసరం..



**గుడ్లవల్లేరు,అక్టోబరు 9 (వార్తాప్రభ) :** సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మాసం గురించి గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. సైబర్ సెక్యూరిటీ నేరాల తీరును వివరిస్తూ వీడియోలు స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. అలాగే మహిళల భద్రత, రహదారి భద్రత నియమాలను కూడా వివరించారు. లాటరీ, ఓటీపీ, ఫైల్ మోసాలు, పెట్టుబడి, షేర్ మార్కెట్ గ్రూపులు, లోన్ యాప్‌లపై మోసాలను నివారించుకునేందుకు 1930 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. మహిళా భద్రత, రోడ్డు భద్రతకు 112కు డయల్ చేయాలని కోరారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు నో చెప్పాలని సూచించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188